విశాఖలో రేవ్ పార్టీ కలకలం

- స్నేహితుల దినోత్సవం వేడుకల పేరుతో రెండు రిసార్ట్స్‌లో లేట్‌నైట్ పార్టీలు
- భారీగా హాజరైన యువతీయువకులు

... మెయిన్ 14లో



ఉక్కుకు మంచి రోజులు



మళ్లీ రిక్రూట్‌మెంట్ చేపట్టాల్సిందిగా కేంద్ర ఉక్కు మంత్రిని కలిసిన ఎంపీ శ్రీభరత్

- నియామకాలు చేపట్టాల్సిన ఆవశ్యకతను వివరించిన వైనం
- ఆర్.కార్డుదారులకూ అవకాశం కల్పించాలని వినతి
- పదోన్నతులపై కూడా చర్చ

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు మళ్లీ మంచి రోజులు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఉత్పత్తి వ్యయం తగ్గింపు పేరుతో కొన్నాళ్లుగా ఉద్యోగులు, కాంట్రాక్టు వర్కర్ల సంఖ్యను తగ్గించుకుంటూ వస్తున్నారు. మరోవైపు వంద శాతం ఉత్పత్తి తీయాలని ఒత్తిడి పెడుతున్నారు. ఉద్యోగులతో పన్నెండు గంటలు పనిచేయిస్తున్నారు. కొన్నేళ్లుగా పదోన్నతులు ఇవ్వడం మానేశారు. ఉద్యోగులకు జీతాలు కూడా సరిగ్గా ఇవ్వడం లేదు. దాంతో వారిలో తీవ్రమైన అసంతృప్తి ఏర్పడింది. మూడు వేల మంది శాశ్వత ఉద్యోగులు, మరో ఐదు వేల మంది కాంట్రాక్టు వర్కర్లను తగ్గించేసి పూర్వంలా వంద శాతం ఉత్పత్తి చేయాలంటే తమ వల్ల కాదని చేతులెత్తేస్తున్నారు. ఇలాగైతే ఎన్నాళ్లో ప్లాంటు నడపలేరని కూడా చెబుతున్నారు. దీనిపై విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ స్పందించారు. దీనిపై సోమవారం ఢిల్లీలో పెద్దలతో చర్చించారు.

కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామిని కలిసి విశాఖపట్నం ప్లాంటులో మళ్లీ రిక్రూట్‌మెంట్ చేపట్టాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఉద్యోగులకు పదోన్నతులు కూడా ఆపేశారని, వారిలో ఉత్సాహం నింపడానికి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. స్టీల్ ప్లాంటు ఏర్పాటుకు భూములు ఇచ్చి నిర్వాసితులుగా మారిన వారిలో చాలామందికి ఇంకా ఉపాధి కల్పించలేదని, వాటిపై కూడా చర్యలు చేపట్టాలని కోరారు.



కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామితో చర్చిస్తున్న ఎంపీ శ్రీభరత్

లాభాలలోకి వచ్చేందుకు సహకారం

- 'ఎక్స్'లో కేంద్ర మంత్రి కుమారస్వామి

ఎంపీ శ్రీభరత్ తనను కలిసిన తరువాత ఉక్కు శాఖ మంత్రి కుమార్‌స్వామి విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు గురించి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. విశాఖపట్నం ప్లాంటు లాభాలలోకి రావడానికి, దానిపై ఆధారపడిన ఆ ప్రాంతం అభివృద్ధి చెందడానికి పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

ఐదేళ్లుగా రిక్రూట్‌మెంట్ లేదు

స్టీల్ ప్లాంటులో పదిహేను వేల మంది శాశ్వత ఉద్యోగులు, మరో 15 వేల మంది కాంట్రాక్టు వర్కర్లు ఉండేవారు. ఏటా వేయి నుంచి 1,200 మంది శాశ్వత ఉద్యోగులు (ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్) పదవీ విరమణ చేస్తున్నారు. ఇంతకు ముందు ఏటా రిక్రూట్‌మెంట్ ఉండేది. 2020లో రిక్రూట్‌మెంట్

... మిగతా 6వ పేజీలో

పారదర్శకంగా భూ సమీకరణ



- ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 1,941 ఎకరాలు...
- త్వరలో గ్రామ సభలు
- ఎండాడ, పీఎంపాలెం, అగనంపూడిల్లో రైతుబజార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):

విశాఖ మెట్రో రీజనల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) కోసం జిల్లాలోని ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 1,941 ఎకరాలు సమీకరిస్తున్నామని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా భూసమీకరణ పారదర్శకంగా చేపడతామన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆనందపురం మండలం గిడిజాలలో 309 ఎకరాలు, గోరింటాలో 198 ఎకరాలు, శొంఠ్యాంలో 251, బీడీ పాలెంలో 122 ఎకరాలు, పద్మనాభం మండలం కొవ్వాడలో 250 ఎకరాల సమీకరణకు నోటిఫికేషన్ జారీచేశామన్నారు. ఇందులో ప్రభుత్వ భూములతోపాటు రైతులకు ఇచ్చిన పట్టా భూములు, రైతుల ఆక్రమణలో ఉన్నవి కొంతమేర ఉన్నాయన్నారు. త్వరలో గ్రామ సభలు నిర్వహించి భూముల స్థితిపై ప్రజలకు తెలియజేసి నివేదిక రూపొందిస్తామన్నారు. రెవెన్యూ రికార్డుల్లో కొత్తగా చేర్పులపై అప్రమత్తంగా ఉన్నామన్నారు. ప్రతి గ్రామంలో డ్రోన్ సర్వే నిర్వహించి భూముల తాజా స్థితిని తెలుసుకుంటామన్నారు. రైతుల ఆక్రమణలో ఉన్న భూముల్లో పంటల సాగు చేస్తున్నారా? లేదా అనేదానిపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల ద్వారా సర్వే చేస్తామన్నారు. భూ సమీకరణ ప్రక్రియ ఐదారు నెలల్లో పూర్తి చేస్తామని జేసీ తెలిపారు.

జిల్లాలో డిమాండ్ మేరకు ఎండాడ, పీఎంపాలెం, అగనంపూడిల్లో కొత్తగా

... మిగతా 6వ పేజీలో

ప్రాణాలు పోతున్నా పట్టదా!?

మారని ఫార్మా కంపెనీల తీరు

మళ్లీ అదే నిర్లక్ష్యం

- లూపిన్‌లో విష వాయువులు లీక్
- ఆరుగురికి అస్వస్థత
- సాధారణ మాస్కులతో కార్మికులు
- వాస్తవాలు దాస్తున్న కంపెనీ యాజమాన్యం
- సహకరిస్తున్న అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పరవాడ రాంకీ ఫార్మాసిటీలో మరోసారి నిర్లక్ష్యం బయటపడింది. గత జూన్ నెలలో సాయి శ్రేయాస్‌లో విషవాయువు వెలువడి ఇద్దరు చనిపోయారు. సరైన మాస్కులు లేని కారణంగా ఈ ప్రమాదం జరిగిందని నిర్ధారణ అయింది. ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనే వారికి పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ (పీపీఈ) కిట్లు ఇవ్వాలని ఆరోజే అధికారులు ఆదేశించారు. కానీ దానిని పాటించకపోవడం వల్ల సోమవారం ఆరుగురు కార్మికులు ఆస్పత్రి పాలయ్యారు. ఈసారి లూపిన్ ఫార్మా కంపెనీలో విషవాయువు లీకైంది.

ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున మూడు గంటలకు జరిగితే యాజమాన్యం ఉదయం 11 గంటలకు ఫ్యాక్టరీస్ అధికారులకు తెలియజేసింది. ప్రతి ఫార్మా కంపెనీ ఇలాగే చేస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను ఆస్పత్రికి పంపి, అక్కడి సాక్ష్యాలన్నీ మార్చేస్తున్నారు. ఏ వాయువు లీకైందో, ఏమి జరిగిందో అధికారులు వచ్చి తెలుసుకునే అవకాశం లేకుండా చేస్తున్నారు. ఇలాంటివి జరగకుండా ఉండాలని ఐటీతో అనుసంధానం చేసిన సెన్సార్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. వాటిని స్థానిక తహశీల్దార్, అగ్నిమాపక దళం, జిల్లా యంత్రాంగానికి అనుసంధానం చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య కంపెనీలన్నింటికీ ఆదేశించారు. ఆ సెన్సార్లు ఎక్కడైనా ప్రమాదం జరిగితే అలారం మోగిస్తాయి. వాటితో అంతా అప్రమత్తమై వెంటనే అక్కడకు వెళతారనేది ఆలోచన. కానీ దీనిని ఎవరూ అమలు చేయడం లేదు. సెన్సార్లు లేవు, సైరన్లు లేవు. ప్రమాదం జరిగిన ఎనిమిది గంటల తరువాత సమాచారం ఇచ్చారు. దాంతో 12 గంటలకు అధికారులకు వెళ్లారు. అప్పటికే ఆ వాయువు అంతా గాలిలో కలిసిపోయింది. ఏమి లీకైందో నిర్ధారించలేమని అధికారులు చేతులెత్తేశారు. ఈ తప్పు చేసినందుకు యాజమాన్యంపై ప్రత్యేకంగా కేసు పెట్టాల్సి ఉంది.





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఉత్పత్తి పేరు చెప్పడం లేదు

ప్రమాదం జరిగిన స్థలానికి అధికారులు వెళ్లారు. ఒక 'ఉత్పత్తి' ప్రక్రియ పూర్తయిన తరువాత వచ్చిన వ్యర్థాలను ఫిల్టరేషన్ యూనిట్‌కు పంపుతున్నప్పుడు ఆ పైపులైన్‌లో ఎక్కడో లీకేజీ వల్ల గుర్తు తెలియని విషవాయువు వచ్చిందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. అక్కడ సాధారణ మాస్కుతో డ్యూటీలో ఉన్న ఉద్యోగి వాంతులు చేసుకున్నారు. బీపీ డౌన్ అయింది. వెంటనే కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆ తరువాత మరో ఐదుగురు అస్వస్థతకు గురయ్యారంటూ వారినీ తరలించారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు.

ఏ మందు తయారు చేస్తున్నప్పుడు ఈ ప్రమాదం జరిగిందో వెల్లడించకుండా సమాచారం దాస్తున్నారు. అందులో ఐసోబ్యుటైల్ నైట్రేట్, మిథైల్ ఎమనైన్‌తో పాటు మరో రసాయనం ఉందని చెబుతున్నారు. దాని పేరు ఏమిటో వెల్లడించడం లేదు. ఉత్పత్తి, అందులో రసాయనాలు చెబితే...ఏ వాయువు వెలువడిందో

... మిగతా 6వ పేజీలో

తల్లికి వందనం కోసం ఎదురుచూపు

జిల్లాలో సాయం అందనివారు 8,000 మంది వరకూ ఉంటారని అంచనా

- ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్లు అనుసంధానం కాకపోవడం, విద్యుత్ బిల్లు అధికంగా రావడం వంటి కారణాలతో విడుదల కాని సొమ్ములు
- వచ్చే నెలలో జమకు అవకాశం



విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఇంకా ఎనిమిది వేల మందికిపైగా తల్లికి వందనం సాయం అందలేదు. పలు కారణాలతో విద్యార్థుల తల్లుల ఖాతాలకు సొమ్ములు జమ కాలేదు. నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువగా విద్యుత్ బిల్లులు రావడం, ఐటీ రిటర్న్స్ సమర్పించడం, ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్లు అనుసంధానం కాకపోవడం, ఉచిత విద్యా పథకం కింద ప్రైవేటు పాఠశాలల్లో సీట్లు పొందిన విద్యార్థుల అన్న/తమ్ముడు/అక్క, చెల్లికి సొమ్ములు అందలేదు. వారంతా విద్యా శాఖ కార్యాలయంతోపాటు కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు.

కూటమి ప్రభుత్వం తల్లికి వందనం కింద ఈ ఏడాది జూన్ 13న జిల్లాలో 1,90,433 మంది విద్యార్థులకు సంబంధించి 1,30,706 మంది తల్లుల ఖాతాలకు సొమ్ములు జమ చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు కూడా ఈనెల నుంచి సొమ్ములు విడుదల చేస్తారు. అయితే అన్ని రకాల అర్హతలున్న విద్యార్థులు సుమారు ఎనిమిది వేల మందికి సొమ్ములు జమ కాలేదని అధికారులు గుర్తించారు. అటువంటి వారంతా అధికారులను కలిసి వినతి పత్రాలు సమర్పించినప్పుడు ఆన్‌లైన్‌లో స్టేటస్ పరిశీలిస్తే పలు కారణాలు ఉన్నట్టు వెల్లడైంది. నగరంలో చాలాచోట్ల ఒక యజమానికి చెందిన ఇళ్లల్లో పలువురు అద్దెకు ఉంటుంటారు. అటువంటిచోట్ల అన్ని కుటుంబాలకు కలిపి ఒకే విద్యుత్ మీటరు ఉండడంతో నెలవారీ విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు మించి వస్తోంది. ఇది ఆయా కుటుంబాలకు చెందిన పిల్లల తల్లుల ఖాతాలకు సొమ్ములు జమ చేయడానికి అడ్డంకిగా మారింది. ఇటువంటి కుటుంబాలు వేర్వేరుగా విద్యుత్ మీటర్లు ఏర్పాటుచేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. దీనిపై పాఠశాల విద్యా శాఖకు నివేదించనున్నారు. ఉచిత విద్య కింద సీట్లు పొందిన విద్యార్థి తోబుట్టువులకు పథకం రాని విషయంలో ఇబ్బంది లేదని, దీనిపై ఆయా పాఠశాలను తనిఖీ చేసి నివేదిక తీసుకుని ప్రభుత్వానికి పంపుతామని చెబుతున్నారు. ఇదిలావుండగా ఆదాయపన్ను శాఖకు రిటర్న్స్ దాఖలు చేసిన కుటుంబాలకు తల్లికి వందనం సొమ్ములు జమ కావడం అనుమానమేనని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకూ పలు కారణాలతో తల్లికి వందనం సొమ్ములు జమకాని తల్లులు విషయంలో అడ్డంకులు తొలగించి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నామని విద్యా శాఖ వర్గాలు తెలిపాయి. ఇటువంటి వారికి వచ్చే నెలలో సొమ్ములు జమ అవుతాయని వివరించారు.

జడ్పీ చైర్‌పర్సన్‌పై చల్లారని అసమ్మతి

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రపై సొంత పార్టీలో మొదలైన అసంతృప్తి చల్లారినట్టు లేదు. ఆమెకు మద్దతుగా ఒక వర్గం, వ్యతిరేకంగా మరో వర్గం తయారైనట్టు చెబుతున్నారు. ఈ క్రమంలో అవిశ్వాసం పెట్టాలనే ప్రతిపాదన మరోమారు తెరపైకి వచ్చినట్టు తెలిసింది.

- రెండుగా చీలిన వైసీపీ జడ్పీటీసీ సభ్యులు
- నేడు దేవరాపల్లిలో జడ్పీటీసీ ఫోరం అధ్యక్షుడి విందు
- చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం గురించి చర్చ
- పార్టీ పెద్దలకు సమాచారం

వచ్చే నెల 23వ తేదీ నాటికి జడ్పీ చైర్‌పర్సన్‌గా సుభద్ర ఎన్నికై నాలుగు సంవత్సరాలు పూర్తి కానున్నది. నాలుగేళ్లు పూర్తయినట్టయితే అవిశ్వాసం పెట్టేందుకు వీలుంటుంది. ఈ నేపథ్యంలో సుభద్రపై అవిశ్వాస తీర్మానం కోసం నెల రోజుల నుంచి సొంత పార్టీకి చెందిన కొందరు సభ్యులు పావులు కదుపుతున్నారు. ఇది సభ్యుల మధ్య విభేదాలకు దారితీసి, ఫోరం అధ్యక్షుడిని మార్చేంత వరకూ వెళ్లింది. జడ్పీటీసీ ఫ్లోర్ లీడర్ ఫైలా సన్యాసిరాజును కూడా మార్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇదిలావుండగా జడ్పీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడిగా కొత్తగా ఎన్నికైన కర్రి సత్యం (దేవరాపల్లి) సొంతూరు మామిడిపల్లిలో మంగళవారం ఆత్మీయ కలయిక పేరిట విందు సమావేశం ఏర్పాటుచేశారు. గ్రామ దేవత పండుగను పురస్కరించుకుని విందు ఇస్తున్నట్టు చెబుతున్నా బల ప్రదర్శన కోసమే ఈ సమావేశం ఏర్పాటుచేస్తున్నట్టు పార్టీలో ప్రచారం సాగుతుంది. విందు సమావేశానికి రావాలని జడ్పీ చైర్‌పర్సన్ సుభద్రను కూడా సత్యం ఆహ్వానించారు. అయితే తనపై కొందరు జడ్పీటీసీ సభ్యులు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తంచేయడం, పెద్దల ముందు పంచాయితీ నిర్వహించిన నేపథ్యంలో ఆత్మీయ కలయిక సమావేశానికి వెళ్లకూడదని చైర్‌పర్సన్ నిర్ణయించుకున్నట్టు చెబుతున్నారు.

చైర్‌పర్సన్‌కు అనుకూలంగా ఉండే జడ్పీటీసీ సభ్యులు ఈ విందు సమావేశానికి వెళ్లకూడదని నిర్ణయించుకున్నట్టు చెబుతున్నారు. అంతేకాకుండా తమకు బాగా సన్నిహితంగా ఉండే సభ్యులను కూడా వెళ్లొద్దని చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వ్యతిరేకవర్గం ఎక్కువ మంది మామిడిపల్లి వచ్చేలా ప్రయత్నాలు చేస్తోంది. ఆత్మీయ కలయిక అనేది రాజకీయాల కోసం కాదని, కేవలం అందరం కలుసుకునేందుకు మాత్రమే ఈ సమావేశం ఏర్పాటుచేస్తున్నామని ఫోరం అధ్యక్షుడు కర్రి సత్యం సహచర సభ్యులకు పంపిన వాట్సాప్ ఆహ్వానంలో పేర్కొన్నారు. కాగా మంగళవారం దేవరాపల్లిలో విందు సమావేశం ఏర్పాటుచేస్తున్న నేపథ్యంలో వైసీపీ నేతలు కొందరు రంగంలోకి దిగి మరోసారి రాజీ కుదిర్చేలా చర్చలు జరిపారని ప్రచారం సాగుతుంది. దీనికి సంబంధించి ఆదివారం నగరంలో ముఖ్య నేతలంతా భేటీ అయి చర్చించారని చెబుతున్నారు. చైర్‌పర్సన్ పదవీ కాలం ఇంకా

... మిగతా 6వ పేజీలో



జల్లిపల్లి సుభద్ర, జడ్పీ చైర్‌పర్సన్

పోర్టు నుంచి పీడీఎస్ బియ్యం రవాణాపై నిఘా

- నేడు పోర్టు, కస్టమ్స్ అధికారులతో మంత్రి నాదెండ్ల భేటీ

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):

పేదలకు అందాల్సిన బియ్యం విదేశాలకు తరలిపోతున్న వ్యవహారంపై ప్రభుత్వం దృష్టిసారించింది. విశాఖ పోర్టు నుంచి పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా అవుతున్నట్టు ఏడాదికాలంలో రెండు పర్యాయాలు గుర్తించారు. ఒకసారి పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, మరోసారి ఆ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో పోర్టు అధికారులు, కస్టమ్స్ అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సమావేశం కానున్నారు. కాకినాడ పోర్టు నుంచి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పట్టుకున్నారు. ఆ తరువాత అక్కడ నిఘా పెంచడంతో బియ్యం అక్రమ రవాణాదారులు విశాఖ పోర్టు నుంచి ఎగుమతులు చేయడం మొదలెట్టారు. కొద్దిరోజులు గుట్టుగా సాగిన ఈ వ్యవహారం మంత్రే స్వయంగా తనిఖీ చేయడంతో బయటపడింది. రెండు నెలల క్రితం అధికారులు దాడులు చేసి మరో కంటెయినర్‌ను పట్టుకున్నారు. ఈ క్రమంలో పీడీఎస్ బియ్యం ఎగుమతిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని మంగళవారం జరగనున్న సమావేశంలో పోర్టు అధికారులకు మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పే అవకాశం ఉంది. విశాఖ పోర్టు నుంచి ఎగుమతి, దిగుమతి కోసం సుమారు పదికి పైగా ఫ్రైట్ కంటెయినర్ గోదాములు ఉన్నాయి. ఏపీ, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశా నుంచి పలు రకాల వస్తువులు ఇక్కడ నుంచి ఎగుమతి కోసం గోదాముల్లో తాత్కాలికంగా నిల్వ చేస్తారు.

ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులతో సమావేశం

పౌర సరఫరాల శాఖా మంత్రి మంగళవారం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల జేసీలు, పౌరసరఫరాల శాఖాధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఎండీయూ వాహనాల రద్దు తరువాత రేషన్ డిపోల్లో సరుకుల పంపిణీ తీరు, ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ, అంశాలపై చర్చించనున్నారు.

ఫాగింగ్ పేరుతో దోపిడీపై కమిషనర్ ఆరా

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ పరిధిలో ఫాగింగ్ పేరుతో జరుగుతున్న అవినీతిపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆరా తీశారు. ఫాగింగ్ పేరిట డీజిల్‌ను పక్కదారి పట్టించడంపై 'మహా దోపిడీ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రజారోగ్య విభాగం అధికారులకు ఫోన్ చేసి ఆరా తీసినట్టు తెలిసింది. ఫాగింగ్ యంత్రాలు ఎన్ని ఉన్నాయి?, ఒక్కోదానికి ఎంత డీజిల్ ఖర్చవుతుందనే వివరాలు అడిగినట్టు సమాచారం. మెగా ఫాగింగ్ యంత్రానికి గంటకు 40 లీటర్లు డీజిల్ అవసరం అవుతుందని అధికారులు నివేదిక ఇవ్వడంపై కూడా కమిషనర్ ప్రశ్నించినట్టు తెలిసింది. సదరు అధికారి నివేదికను తప్పుగా ఇచ్చారని, వాస్తవంగా గంటకు వంద లీటర్లు అవుతుందని కిందిస్థాయి సిబ్బంది చెబుతున్నారని అధికారులు వివరణ ఇచ్చినట్టు తెలిసింది. మంగళవారం దీనిపై సమగ్ర సమాచారం తనకు అందజేయాలని కమిషనర్ ఆదేశించినట్టు సమాచారం.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు తీవ్ర పోటీ

ముగిసిన ఇంటర్వ్యూలు

- ఎంపికైన అభ్యర్థులకు రెండు రోజుల్లో సమాచారం
- రిటైర్డ్ ఫ్యాకల్టీ, సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు దరఖాస్తు

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి చేపట్టిన ఇంటర్వ్యూలు సోమవారంతో ముగిశాయి. ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్ కాలేజీ పరిధిలోని వివిధ విభాగాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి గత నెల నోటిఫికేషన్ ఇవ్వగా, సుమారు 1,400 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన అధికారులు 1,250 మందిని ఇంటర్వ్యూలకు పిలిచారు. వారికి గడిచిన నాలుగు రోజుల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ వస్తున్నారు. సోమవారం రాత్రి 9 గంటలకు ఆ ప్రక్రియను ముగించారు. ఎంపికైన అభ్యర్థులకు

... మిగతా 6వ పేజీలో



అప్పన్నకు రూ.2.79 కోట్ల ఆదాయం

సింహాచలం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):

వరాహ లక్ష్మీనృసింహస్వామికి గడచిన 28 రోజుల్లో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల ద్వారా సుమారు రూ.2.78 కోట్ల ఆదాయం లభించింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు ఆధ్వర్యంలో సోమవారం పరకామణి కేంద్రంలో కానుకలు లెక్కించారు. హుండీల ద్వారా రూ.2,78,53,475 నగదు, 99.5 గ్రాముల బంగారం, 11.35 కిలోల వెండి ఆభరణాల రూపంలో సమకూరింది. ఇంకా 704 యూఎస్ డాలర్లు, 110 ఆస్ట్రేలియా కరెన్సీ, 55 యూరో కరెన్సీ, 260 టర్కీ కరెన్సీ, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, యుఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, నేపాల్, మలేషియా, ఇండోనేషియా తదితర దేశాలకు చెందిన కరెన్సీ అప్పన్న ఖజానాకు లభించింది. కానుకల లెక్కింపులో పలు సేవాసంస్థల కార్యకర్తలు, దేవస్థానంలోని పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల కోసం మేయర్‌కు వినతి



మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందిస్తున్న కార్పొరేటర్

సింహాచలం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహావిశాఖ 98వ వార్డు పరిధిలోని పలుప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సహకరించి నిధులు కేటాయించాలని కార్పొరేటర్ పి.వి.నరసింహం నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు కోరారు. సోమవారం జీవీఎంసీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. సంతోషిమాత వీధి నుంచి సమీప ప్రైవేటు స్కూల్ మీదుగా అడివివరం గ్రంథాలయం వరకు, యూనివర్సిటీ లే అవుట్‌కు కె.కన్వెన్షన్ వెనుక వీధిలో రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని కోరారు. అడివివరం శివాలయం పక్కనుంచి, సింహగిరి ఘాట్‌రోడ్డు ఏరియాలో ప్రైవేటు కల్యాణ మండపం సమీపంలో రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలని కోరారు. తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ కూడా మేయర్‌ను కలిశారు.

వేతన బకాయిల కోసం బీచ్ కార్మికుల డిమాండ్



జడ్సీకి వినతి పత్రాన్ని అందిస్తున్న పారిశుధ్య కార్మికులు

భీమునిపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ భీమిలి బీచ్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి మూడు నెలల వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని సీఐటీయూ నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి డిమాండ్ చేశారు. సోమవారం జోనల్ కార్యాలయం ముందు సిటు ఆధ్వర్యంలో వారు ఆందోళన చేపట్టి జడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన బీచ్ కార్మికులకు ప్రతినెలా తప్పనిసరిగా కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. మునిసిపల్ చట్టాన్ని వీరికి వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పలనాయుడు, నారాయణ, అప్పారావు, పుష్ప, వెంకటలక్ష్మి, యమున తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం జీవీఎంసీ ఏర్పాట్లు చేయాలి

» సీపీఐ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ భీమిలి కార్యదర్శి రాంబాబు

తగరపువలస, ఆగస్టు 04 (ఆంధ్రజ్యోతి) తగరపువలస, చిట్టివలస ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందించేందుకు జీవీఎంసీ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సోమవారం తగరపువలసలో జరిగిన సీపీఐ సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశానికి భీమిలి ఏరియా కార్యదర్శి రాంబాబు అధ్యక్షత వహించారు. గోస్తనీ నదిలో పాడైన చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేయించి ఆధునిక పద్ధతిలో నిర్మించాలని కోరారు. ఈ ప్రాంతంలో గొట్టపుబావుల్లో ఉప్పునీరు వస్తుండడంతో చాలామంది తాగునీటి కోసం ఫిల్టర్ నీటిని కొనుగోలు చేస్తున్నారని, ఈ పరిస్థితిని నివారించాలని కోరారు. తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీటి సరఫరాకు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేయాలని జీవీఎంసీ అధికారులను కోరుతూ తీర్మానించారు. ఈ సమావేశంలో ఎం.అప్పలరాజు, ముత్యాలరావు, అప్పారావు పాల్గొన్నారు.

కాలువ సమస్యకు త్వరలో పరిష్కారం

» జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు

భీమునిపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సుమారు రెండు వారాలుగా పీడిస్తున్న సుభాష్‌రోడ్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మురుగునీటి కాలువ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భీమిలి జోనల్ కమిషనరు అయ్యప్పనాయుడు తెలిపారు. సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. పురాతన రాతికాలువ పూడుకుపోవడం వల్ల జీవీఎంసీ యూజీడీ కెమికల్‌తో ప్రయత్నించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. జీవీఎంసీ ఇంజనీరింగ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు నూతన కాలువ నిర్మించాల్సిన ఆవశ్యకతను వివరించారన్నారు. త్వరలో అంచనాలు రూపొందించి కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రహదారి పక్కనే ఐరన్ గ్రిల్ ఏర్పాటు



ఎండాడ-రుషికొండ డబుల్ రోడ్డులో నిర్మించిన ఐరన్ గ్రిల్

ఎండాడ, ఆగస్టు 04 (ఆంధ్రజ్యోతి): ఎండాడ-రుషికొండ డబుల్ రోడ్డులో ట్రాఫిక్‌కి ఇబ్బంది కలిగించే విధంగా ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులో దుకాణాలు తొలగించాలని ఇటీవల జీవీఎంసీ కమిషనరు కేతన్‌గార్గ్ క్షేత్ర స్థాయి పర్యటనలో టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కాలువలు, రహదారులు ఆక్రమించి వాణిజ్య సముదాయాలు నిర్మించుకున్నా, రహదారిపైన ఉన్న స్థలం నాదేనంటూ చిన్నచిన్న దుకాణదారుల నుంచి అద్దెలు వసూలు చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఐరన్ గ్రిల్ తొలగించాలని స్థానికులు విన్నవించుకుంటున్నారు.

15 కేజీల పాలిథిన్ కవర్ల పట్టివేత



పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న జీవీఎంసీ సిబ్బంది

భీమునిపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న పాలిథిన్ కవర్లను సోమవారం జోన్ వన్ పర్యావరణ కార్యదర్శులు, ప్రజారోగ్య విభాగం మేస్త్రీలు దాడులు చేసి పట్టుకున్నారు. జోనల్ కమిషనరు అయ్యప్పనాయుడు ఆదేశాలతో సచివాలయాల పర్యావరణ కార్యదర్శులు మనోజ్, సురేష్, వరప్రసాద్, త్రివేణి, శివ, శానిటరీ మేస్త్రి రేగాని రవి పట్టణంలోని పెద్ద బజారులో వున్న చికెన్ దుకాణాలు, టిఫిన్ షాపులపై ఆకస్మిక తనిఖీలు చేసి 15 కిలోల పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకుని, జరిమానా విధించారు.

రైతన్న కళ్లల్లో ఆనందం నింపాలి

» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



నూతన పాలక వర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



భీమునిపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ మార్కెట్ కమిటీలు అండగా నిలబడాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. సోమవారం భీమిలి వ్యవసాయ మార్కెట్ యార్డులో కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ రైతు కోసం పనిచేసే ప్రభుత్వాలు ఉండడం వ్యవసాయానికి శుభపరిణామమన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రాష్ట్రప్రభుత్వం రూ. 14 వేలు, పీఎం కిసాన్ పథకం కింద కేంద్రం రూ.6 వేలు కలిపి మొత్తం ఏడాదికి ప్రతి రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు వివరించారు. రైతు బిడ్డగా వ్యవసాయదారుల కష్టం తెలుసునని, పండించే పంటకు ధర నిర్ణయించుకోలేని నిస్సహాయత వారిదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు సేవ చేసే అవకాశం మార్కెట్ కమిటీలకు వచ్చిందని, అందువల్ల రైతు కళ్లల్లో కన్నీరు బదులు ఆనందం నింపేలా కమిటీ సభ్యులందరూ కృషి చేసి పదవులకు వన్నె తేవాలని కోరారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భీమిలి వ్యవసాయ పాలక మార్కెట్ కమిటీ ఛైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు, సభ్యులందరితో ఆయన ప్రమాణం చేయించారు. అధికారంలో ఉండగా ఇంట్లో నుంచి బయటకు రాని జగన్‌మోహన్‌రెడ్డి ఇపుడు రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తుందనడంపై గంటా మండిపడ్డారు. కేవలం ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు 2 నుంచి 3 వేల మంది పోలీసులను రక్షణగా ఉంచుతున్నామన్నారు. కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర డైరెక్టర్ పంచకర్ల సందీప్ మాట్లాడుతూ తమ పిల్లలు మంచి రైతు కావాలనే ఆలోచనకు వచ్చేలా రైతు సంక్షేమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ పనిచేయాలని ఆకాంక్షించారు. మార్కెట్ కమిటీ నూతన ఛైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, మాజీ మంత్రి పడాల అరుణ, డెప్యూటీ మేయరు గోవింద రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, భీమిలి మండల టీడీపీ అధ్యక్షుడు దంతులూరి అప్పల నరసింహరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కసిరెడ్డి దామోదరరావు, బీజేపీ నాయకుడు కైలాస్‌రెడ్డి, జనసేన నాయకులు శ్రీధర్, కృష్ణయ్య, అక్కరమాని దివాకర్, భువనేశ్వరి, ఉప్పాడ అప్పారావు, టీడీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు పాల్గొన్నారు.

రెండు నెలల్లో పూడికతీత పనులు పూర్తిచేయాలి

» అధికారులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశం



కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

మధురవాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 5, 6, 7 వార్డుల పరిధిలోని కాలువల్లో పూడికతీత పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ కనకమహలక్ష్మిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. 7వ వార్డు పరిధిలోని కాలువలను జోనల్ కమిషనర్‌తో కలసి సోమవారం ఆయన పరిశీలించారు.పూడికతీత పనులకు రూ.75 లక్షలు మంజూరు చేసినా ఇంతవరకు ఎందుకు పూర్తికాలేదని జడ్సీని ప్రశ్నించారు. రహదారుల వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నందున యంత్రాలతో పూడిక తీయించడం సాధ్యం కానందున ఆలస్యమవుతోందని జడ్సీ వివరణ ఇచ్చారు. పనులు వేగంగా జరిగేందుకు అవసరమైతే ట్రాఫిక్ పోలీసుల సహాయం కోసం అధికారులతో మాట్లాడతానని గంటా తెలిపారు. నాలుగేళ్లుగా కాలువల్లో పూడికలు తొలగించకపోవడం వల్ల మూడడుగుల మేర పేరుకుపోవడంతో అవి గట్టిపడిపోయాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 7 వ వార్డు పరిధిలోని కొన్ని కాలనీలకు సక్రమంగా తాగునీరు అందడం లేదని స్థానికులు ఆయనకు తెలిపారు. అందరికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. చంద్రంపాలెం వద్ద బస్టాపు ఉన్నా ఆర్టీసీ బస్సులు ఆగడం లేదని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా, ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి బస్సులు ఆగేలా చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అపార్ట్‌మెంట్ల నుంచి వచ్చే వాడుకనీరు కాలువల్లో కలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో అడ్డంకులు సృష్టిస్తున్న వారిని నియంత్రించాలని జడ్సీని ఆదేశించారు. ఎండాడ భూకుంభకోణంపై రెండు నెలల కిందట విచారణ జరిపించాలని కలెక్టర్‌కు లేఖ రాశానని ఎమ్మెల్యే తెలిపారు. మాజీ సైనికోద్యోగి భూమి విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ నేతలు పిళ్లా వెంకటరావు, దువ్వారపు రామారావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు సంప్రదాయబద్ధంగా ఆర్జిత సేవలు



స్వామివారికి తులసీ దళార్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులను స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. షోడశోపచారాలు సమర్పించారు. తొలుతగా నారసింహ సహస్రనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళార్చన జరిపారు. తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి గరుడసేవ నిర్వహించారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు ఆర్జిత నిత్యకల్యాణాన్ని పాంచరాత్రాగమశాస్త్ర రీతిలో నిర్వహించి స్వామికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

బాధితుడికి ముఖ్యమంత్రి సహాయం



బాధితునికి పరిహార చెక్కును అందిస్తున్న గంటా రవితేజ

భీమునిపట్నం (రూరల్) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భీమిలి పరిధిలోని బంగ్లామెట్టలో వెంపాడ అరవిందరెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.60 లక్షలు మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ సోమవారం బాధితుడికి అందించారు. బంగ్లామెట్ట వెంపాడవీధిలో ఉంటున్న అరవిందరెడ్డి 9 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమైన విషయాన్ని స్థానిక తెలుగుదేశం నాయకులు ఎంఎల్ఏ గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకుని వెళ్లగా ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం లేఖ రాసి సహాయాన్ని రప్పించారని అన్నారు. ఈ మొత్తాన్ని బాధితుడి ఇంటికి వెళ్లి అందించారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నేడు

భీమునిపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో కోర్సులలో మిగులు సీట్లకు మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఆ కళాశాలలో డిప్లమో ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, సివిల్ ఇంజనీరింగ్ కోర్సులలో తక్షణ ప్రవేశాలు జరుపుతున్నామన్నారు. పాలిసెట్-2025 ప్రవేశ పరీక్ష రాయకపోయినా, పదో తరగతి కంపార్ట్‌మెంట్ ద్వారా పాసయిన విద్యార్థినులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా సీటు పొందిన అభ్యర్థినులకు ఎటువంటి ఫీజు రాయితీ వర్తించదని, స్కాలర్‌షిప్ సౌకర్యం లభించదని స్పష్టంచేశారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా, పాలిసెట్-2025 హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు పరీక్షకు హాజరైనవారు మాత్రమే, టిసి, కులం, 4 నుంచి పదో తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ ఒరిజినల్స్, 3 జతల జిరాక్స్ కాపీలు తీసుకుని మంగళవారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో హాజరుకావాలని సూచించారు.

పీజీఆర్ఎస్‌కు 9 ఫిర్యాదులు

భీమునిపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు 9 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు ఈ కార్యక్రమం జరిగింది. జడ్సీ అయ్యప్పనాయుడుకు అందిన అర్జీల్లో ముఖ్యంగా పట్టణ ప్రణాళికా విభాగానికి 4, ప్రజారోగ్యం విభాగానికి 1, ఇంజనీరింగ్ విభాగానికి 3, రెవెన్యూ విభాగానికి ఒక అర్జీ అందినట్లు అధికారులు తెలిపారు. ఈ సమస్యలపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు పంపారు.

వేతనాలు పెంచాలంటూ అంగన్‌వాడీల ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

భీమునిపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు కనీస వేతనాన్ని అమలు చేస్తూ, పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి డిమాండ్ చేశారు. పట్టణంలోని కృష్ణాకాలనీలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం ముందు భీమిలి ప్రాజెక్టు అంగన్‌వాడీలు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కొత్త ట్యాబ్‌లు అందించాలని, యాప్‌ల భారం తగ్గించాలని తదితర డిమాండ్లను నినదించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంగన్‌వాడీలకు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిటు నాయకులు ఎస్.అప్పలనాయుడు, ఐసీడీఎస్ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శ్రీదేవి, నరసయ్యమ్మ, సుగుణ, సీత తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న నిత్యాన్నప్రసాద పథకానికి రూ.2 లక్షల విరాళం



చెక్‌ను అందజేస్తున్న దాత డా.కె సూర్యప్రకాశరావు

సింహాచలం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి తగరపువలస ప్రాంతానికి చెందిన ఉప్పాడ బాల ఆదిత్యరెడ్డి దంపతులు రూ.లక్షను నగదు రూపంలో, అదే విధంగా నగరంలోని మహారాణిపేట ప్రాంతానికి చెందిన డా.కె.సూర్యప్రకాశరావు, లక్ష్మీ దంపతులు మరో రూ.లక్ష విరాళాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. సోమవారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావుకు చెక్కులను అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాతల కుటుంబాలకు అంతరాలయ దర్శనం చేయించి, శేషవస్త్రాలతో సత్కరించి , ప్రసాదాలను అందజేశారు.

హామీల అమలులో కూటమి విఫలం

» తగరపువలసలో వైసీపీ సమావేశం

తగరపువలస, ఆగస్టు 04 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా చాలా సమస్యలు పరిష్కారం కాలేదని, వీటిని ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి గ్రామ స్థాయి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని రెండో వార్డు ఇన్‌చార్జి శిల్ల సరళా కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తగరపువలసలో వివిధ వార్డు ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరిగిపోయిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు తెస్తామని ప్రజలను చంద్రబాబు మోసం చేశారన్నారు.

ఈ నెల 6న భీమిలి బీచ్‌రోడ్డులోని సవేరా రిసార్టులో నాలుగు వార్డుల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు పీతల అప్పారావు, వంశీరెడ్డి, ఎస్.సూర్యనారాయణ, నమ్మి మాధవ్, తోనంగి ఎల్లాజీ, నమ్మి భాస్కరరావు, సరగడ నాగిరెడ్డి, నీలాతి రాము, చుట్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళన తీవ్రతరం



మర్రిపాలెంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సెల్‌ఫోన్‌లు పట్టుకొని ఆందోళన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

మర్రిపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): 'నో ఫోన్.. నో వర్క్' పేరిట ఆన్‌లైన్ సేవలను బహిష్కరించిన అంగన్‌వాడీలు ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్దనున్న ఐసీడీ ఎస్ కార్యాలయం ఎదుట సోమవారం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. అంగ న్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు (సీఐటీయూ) కె.వెంక టలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యాప్‌ల పనిభారంతో సతమతమవుతుంటే, అదనంగా ఆరోగ్యశాఖకు చెందిన ప్రధాన మంత్రి మాతృత్వవందన యోజన ద్వారా ఏఎన్ఎం, ఆశా వర్కర్లు చేయవలసిన గర్భిణులు, బాలింతల నమోదు ప్రక్రియ సైతం తమకే అప్పగించి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వర్ పనిచేయక సెల్‌ఫోన్‌లు మొరాయిస్తే లబ్ధిదారులు తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారని, కిశోర్‌వికాస్, మిషన్ వాత్సల్య, సఖి గ్రూప్‌లుగా ఏర్పాటు చేసి అందులో స్థానిక నాయకులను, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసి ప్రతి మూడో శుక్రవారం సమావేశం నిర్వహించాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని చెప్పిన ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ ఏడాదిన్నర కావస్తున్నా అంగన్వాడీల వేతనాలపై స్పందించలేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో పూరిస్థాయిలో 'నో ఫోన్..నో వర్క్' విధానాన్ని పాటిస్తామన్నారు. లబ్ధిదారుల సౌకర్యార్థం ఆఫ్‌లైన్ విధానంలో రేషన్ అందిస్తామన్నారు. అనంతరం సీడీపీఓ నీలిమకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, సీఐటీయూ గౌరవ అధ్యక్షులు మణి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ నాయకులు పిశ్యామలదేవి, పి.కృపారాణి, ఎ.నూకరత్నం, అన్నపూర్ణ, దేవ, సుబ్బలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుకు మంచి రోజులు

... 5వ పేజీ తరువాయి

నోటిఫికేషన్ ఇచ్చి, ఆపేశారు. అప్పటి నుంచి కొత్తగా ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదు. నష్టాలు, ఆర్థిక ఇబ్బందులు, ఉత్పత్తి వ్యయం తగ్గింపు పేరుతో ఉద్యోగులు, కాంట్రాక్టు వర్కర్ల సంఖ్య తగ్గించుకుంటూ వచ్చారు. ఇప్పుడు శాశ్వత ఉద్యోగులు 10,200 మంది మాత్రమే ఉన్నారు. వారిలో ఎగ్జిక్యూటివ్స్ 3,200 మంది కాగా మిగిలినవారు నాన్ ఎగ్జిక్యూటివ్స్. కాంట్రాక్టు వర్కర్లు ఎనిమిది వేల మందే ఉన్నారు. వీరితో 100 శాతం ఉత్పత్తి సాధ్యం కాదనేది అందరికీ తెలిసినా ఖర్చులు తగ్గించాలని మౌనంగా ఉన్నారు. ఇలా నడిపితే ప్లాంటు మూతపడే ప్రమాదం ఉండడంతో తక్షణమే కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని ఎంపీ శ్రీభరత్ కోరారు.

50 శాతం ఉద్యోగులు నిర్వాసితులకే

కూటమి ప్రభుత్వం వస్తే నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తుందని పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. దానిని నిలుపుకొనే దిశగా ఇప్పుడు ప్రయత్నిస్తున్నారు. ప్లాంటులో కొత్తగా టెక్నికల్ ఉద్యోగాలు ఏమైనా తీస్తే అందులో 50 శాతం నిర్వాసితులకు కేటాయిస్తున్నారు. ఇప్పుడు ఆ విధంగానే నిర్వాసితులకు అవకాశం కల్పించాలని ఎంపీ శ్రీభరత్ కోరారు. స్టీల్ ప్లాంటులో ఇంకా ఎనిమిది వేల మందికి ఉపాధి కల్పించాల్సి ఉంది. అలాగే ఇటీవల తొలగించిన కాంట్రాక్టు వర్కర్లను తిరిగి తీసుకోవాలని ఆయన మంత్రిని అడిగారు.

విద్యాలయాలపైనా చర్చ

స్టీల్‌ప్లాంటులో కేంద్రీయ విద్యాలయం ఉంది. దానిని కేంద్ర విద్యా శాఖ పరిధిలోకి మార్చాలని ఎంపీ కోరారు. అదేవిధంగా విమల విద్యాలయం సిబ్బందికి స్వచ్ఛంద పదవీ విరమణ పథకం అమలు చేయాలని, ఆర్థిక భద్రత కల్పించాలని కోరారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా!?

... 5వ పేజీ తరువాయి

శాస్త్రవేత్తలు పసిగట్టేస్తారు. కేసు తీవ్రతరమవుతుంది. అందుకని పేరు బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. అధికారులు ఎవరి స్థాయిలో వారు సహకరిస్తున్నారు.

ఇవన్నీ లోపాలే

- ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం ఇవ్వలేదు.
- ఏ ఉత్పత్తి తయారీలో, ఎక్కడ ప్రమాదం జరిగిందో వెల్లడించలేదు.
- సిబ్బందికి పీపీఈ కిట్లు ఇవ్వకుండా సాధారణ మాస్క్‌లే ఇచ్చారు.
- విష వాయువులు లీకైతే గుర్తించే సిస్టమ్ లేదు.
- ఉత్పత్తికి సంబంధించి ఏ ప్రమాదాలు జరుగుతాయి? వాటిని ఎలా నిరోధించాలి? అనే హజార్డస్ ప్లాన్ ఉండాలి. అది కూడా లేదు. దానిపై సిబ్బందికి అవగాహన కల్పించలేదు.
- ఘటన జరిగిన 18 గంటల తరువాత కూడా ఏ వాయువు, ఎక్కడ లీకైందో గుర్తించలేదు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు తీవ్ర పోటీ

... 5వ పేజీ తరువాయి

రెండు రోజుల్లో సమాచారాన్ని అందించనున్నారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో నోటిఫికేషన్ ఇవ్వడంతో రాష్ట్రానికి చెందినవారే కాకుండా హైదరాబాద్ వంటి ప్రాంతాలకు చెందినవారు కూడా దరఖాస్తు చేసుకున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీగా ఎంపికైన అభ్యర్థులు వారానికి మూడు నుంచి నాలుగు తరగతులు బోధించాల్సి ఉంటుంది. అందుకుగాను ఆరు నెలలకు రూ.45 వేలు చొప్పున చెల్లించనున్నారు. ఈ పోస్టులకు పూర్తిస్థాయిలో సమయాన్ని వెచ్చించాల్సిన అవసరం లేకపోవడంతో అనేక రంగాలకు చెందినవారు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటికే వర్సిటీలోని వివిధ విభాగాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన అధ్యాపకులు కూడా ఉన్నారు. ఇలా పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఆరుగురు వరకు ఇంటర్వ్యూలకు హాజరైనట్టు తెలిసింది. అలాగే, గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తూ పీహెచ్‌డీ అర్హత ఉన్న కొందరు దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణలోని హైదరాబాద్ ప్రాంతానికి చెందినవారు కూడా పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. అయితే, రిటైర్డ్ ఉద్యోగులు, సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది, తెలంగాణకు చెందిన వారి దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవడం పట్ల కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పదవీ విరమణ చేసిన వారిని, ఇతర ఉద్యోగాలు చేస్తున్న వారిని ఇంటర్వ్యూలకు పిలవడం దారుణమంటున్నారు. దీనిపై అధికారులు మాత్రం స్పందించడం లేదు.

పారదర్శకంగా భూసమీకరణ

... 5వ పేజీ తరువాయి

రైతుబజార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. కొత్త రైతుబజార్ల ఏర్పాటుకు స్థలాలు ఎంపిక చేశామని తెలిపారు. ఆరిలోవ రైతుబజార్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మధురవాడ రైతుబజార్ ఎదురుగా ఉన్న ఆక్రమణలు తొలగించాలని జీవీఎంసీకి లేఖ రాశామని జేసీ తెలిపారు. ఎండీయూల రద్దు తరువాత రేషన్ డిపోల ద్వారా బియ్యం పంపిణీ గాడిలో పడిందని, చిన్నచిన్న ఇబ్బందులు ఏమైనా ఉంటే పరిష్కస్తామని పేర్కొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌పై చల్లారని అసమ్మతి

... 5వ పేజీ తరువాయి

ఏడాది మాత్రమే ఉన్నందున ఇప్పుడు అవిశ్వాసం పెట్టి పార్టీని ఇరకాటంలో పెట్టడం కంటే మధ్యేమార్గంగా ఆలోచన చేయాలని భావిస్తున్నట్టు కొందరు సభ్యులు అంతర్గత సంభాషణలలో చర్చించుకున్నారు. మంగళవారం నాటి సమావేశం తరువాత సభ్యులందరితో మరోసారి విశాఖలో సమావేశం ఏర్పాటుచేయాలని పార్టీ సీనియర్ నేతలు భావిస్తున్నారు.

సనాతన ధర్మం పటిష్ఠమైనది



తాళ్లపాక హరినారాయణతో కర్షక దేవోభవ ప్రతినిధులు

మద్దిలపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం చాలా పటిష్ఠమైనదని తాళ్లపాక అన్నమాచార్యుల వారి 12వ తరానికి చెందిన తాళ్లపాక హరినారాయణ ఆచార్యులు పేర్కొన్నారు. సోమవారం నగరానికి వచ్చిన ఆచార్యులను కర్షక దేవోభవ జాతీయ అధ్యక్షుడు ఆడారి కిశోర్‌కుమార్ నేతృత్వంలో భక్తులు ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ఎవరూ పరిరక్షించాల్సిన అవసరం లేదని, హిందువులంతా తూచా తప్పకుండా ఆచరిస్తే సనాతన ధర్మానికి మించిన ధర్మమే ప్రపంచంలో ఉండదన్నారు. జీవితాన్ని గడపడానికి ఒక మంచి మార్గమని వివరించారు. ఆచార్యులను కలిసిన వారిలో సినీ నిర్మాత పి.నీలతిలక్, సరగడం సింగినాయుడు, శ్రీను, అనిల్ తదితరులున్నారు.

చెత్తను తొలగించరా?



పైనాపిల్ కాలనీలో చెత్తతో నిండిన కాలువ

ఆరిలోవ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీ సర్వీసు రోడ్డును ఆనుకున్న కాలువ చెత్తతో నిండిపోయింది. దీంతో మురుగునీరు దిగువకు ప్రవహించేందుకు వీలులేని పరిస్థితి ఎదురవుతోంది. పైగా దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 500 మీటర్లున్న ఈ ప్రధాన కాలువను చెత్తకుప్పగా మార్చడంతో సమస్యలు ఎదురవుతున్నాయని జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది తక్షణం స్పందించి కాలువను శుభ్రం చేయాలని కోరుతున్నారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లే వారికి కాలువ దుర్గంధంతో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. విష పురుగులకు ఆలవాలంగా మారుతోందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ స్కూటర్ ఎవరిదో?



సాలిపేట సర్వీసు రోడ్డులో ఉన్న స్కూటర్

ఆరిలోవ, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): జీవీ ఎంసీ 12వ వార్డు సాలిపేటలో ఓ స్కూటర్ చాలా కాలంగా పార్కింగ్ చేసి ఉండిపోయింది. ఇది ఎవరిదో, ఎందుకు ఇక్కడ ఉంచారో తెలియడం లేదని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు స్పందించి దానిని అక్కడి నుంచి తొలగించాలని కోరుతున్నారు.

సినిమా గైడ్

● **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
● **కింగ్డమ్** : జగదాంబ
● **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
● **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
● **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 32, బీరకాయలు 48, ఆనపకాయ 20,కాలీఫ్లవర్ 34, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 40, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 74, బరబాటి 44, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50,బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 102, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్క కూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474


చికెన్ ధరలు

బ్రాయ్

రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190



పోర్టులో పోగులుగా వేసిన బొగ్గు నిల్వలపై అరకొరగా కప్పిన టార్పాలిన్లు



కన్వేయర్ బెల్టుద్వారా బొగ్గు వెళ్తుండగా వెలువడుతున్న ధూళి

కమ్మేస్తున్న పోర్టు కాలుష్యం

- పరిసర ప్రాంతాలను చుట్టేస్తున్న ధూళి
- బొగ్గు నిల్వలతో సమస్య జటిలం
- వ్యాధులు చుట్టుముట్టి నరకయాతన
- ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని అధికారులు
- కోట వీధి, చిలకపేట, జాలారిపేట ప్రాంతాల్లో దారుణ పరిస్థితి

బీచ్ రోడ్డు, ఆగస్టు 4, (ఆంధ్రజ్యోతి): పోర్టు కాలుష్యంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా బొగ్గు నిల్వల కారణంగా ఎగసిపడిన దుమ్ము, ధూళితో రంగుమారిపోతున్నామని వాపోతున్నారు. నిత్యం నరకయాతన అనుభవిస్తున్నామని, వ్యాధుల బారిన పడి అల్లాడుతున్నామని గగ్గోలుపెడుతున్నారు. కాలుష్యం నుంచి రక్షణ కల్పించాలని ప్రజా ప్రతినిధులు, అధికారులను వేడుకున్నా ఫలితం కనిపించకపోవడంతో ఏళ్లుగా సమస్యలతో సావాసం చేస్తున్నామంటున్నారు. దీనికితోడు బొగ్గును లారీలతో రవాణా చేస్తుండడంతో ధూళి ఎగసిపడి ఉక్కిరిబిక్కిరవుతున్నామంటున్నారు

నగరం చుట్టుపక్కల విరివిగా పరిశ్రమలు నెలకొల్పడంతో వాటికి అవసరమైన బొగ్గును విదేశాలనుంచి దిగుమతి చేసుకొని పోర్టులో గుట్టలుగా పోస్తుంటారు. వాటిపై టార్పాలిన్లు కప్పి, బొగ్గు, ధూళి బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలి. కానీ పోర్టు యాజమాన్యం గుట్టలపై సగం వరకు మాత్రమే టార్పాలిన్లు కప్పి, మిగతా వాటిని వదిలేస్తోంది. దీనివల్ల సముద్రం మీదుగా వచ్చే గాలుల్లో బొగ్గు, ధూళి కలిసిపోయి పాత నగరం మొత్తాన్ని కమ్మేస్తోంది. ముఖ్యంగా కోట వీధి, జాలారిపేట, వెలంపేట, ప్రసాద్ గార్డెన్స్, రెల్లి వీధి ప్రాంతాలు బొగ్గు ధూళితో నిండిపోతున్నాయి. దీంతో నివాసితులు నిత్యం మసిబారిపోతున్నారు. వ్యాధుల బారిన పడి విలవిల్లాడుతున్నారు.



కాలువలోని నీటిపై పేరుకుపోయిన బొగ్గు ధూళి

రోగాల బారిన ప్రజలు...

బొగ్గు కాలుష్యంతో స్థానికులు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. ఆస్మా, ఆయాసం, గుండె, కంటి వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఊపిరితిత్తులు, శ్వాసకోస వ్యాధులు మరింత ప్రబలే ప్రమాదం ఉందంటున్నారు. బొగ్గు లారీల వెనుక వెళ్లే పాదాచారులు ద్విచక్ర వాహనదారులు ముక్కుకు మాస్కులు కట్టుకుని వెళ్లాల్సి వస్తోంది.

ఇలా చేస్తే మేలు...

- రహదారులకు ఇరువైపులా బొగ్గు నుసితో కలిసిపోయిన ఇసుక మేటలను తక్షణం తొలగించాలి.
- కాలం చెల్లిన లారీలతో పాటు డోర్లు దెబ్బ తిన్న లారీలను రవాణాకు వినియోగించకూడదు.
- పల్లపు ప్రాంతాలు, మలుపుల వద్ద లారీలను అతి వేగంగా నడపడంతో బొగ్గు రాలి పడిపోతోంది. వేగం తగ్గించడంతోపాటు శిథిల రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.
- నీటితో తడిపిన అనంతరం బొగ్గును లారీల్లో లోడ్ చేస్తే పొడి అక్కడే రాలిపోతోంది.
- పరిమితి మించి లోడ్‌తో రాకపోకలు సాగించే లారీలపై చర్యలు తీసుకోవాలి.
- లారీలనుంచి బొగ్గు రాలకుండా టార్పాలిన్‌ను పటిష్ఠంగా కట్టాలి.
- అసంపూర్తిగా ఉన్న రైల్వే ట్రాక్ వద్ద సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేయాలి.

ఏళ్లుగా నరకం చూస్తున్నాం



బొగ్గు లారీల కాలుష్యంతో ఏళ్లగా నరకం చూస్తున్నాం. ధూళి ఇళ్లల్లోకి రావడంతో ఉండలేని పరిస్థితి. శ్వాస, కంటి, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. లారీల నుంచి బొగ్గు రాలకుండా చర్యలు తీసుకోవడం లేదు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోవడం లేదు. **- నూకాలమ్మ, కోట వీధి**

సమస్య పరిష్కరించాలి



ఎన్నికల ముందు వివిధ రాజకీయ పార్టీల నేతలు హామీలిస్తున్నారు. సమస్యలు తీర్చేవారే కనిపించడం లేదు. వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. రోజూ భయంతో బతికేకంటే మరోచోటకు వెళ్లిపోవడం మంచిదేనన్న అభిప్రాయం ఉంది. పోర్టు కాలుష్యంపై కలెక్టర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. **- బర్రి కొండబాబు, జాలారిపేట**

ప్రజా సంక్షేమం, అభివృద్ధికే ప్రభుత్వ ప్రాధాన్యం

- తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఆరిలోవ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు అన్నారు. జీవీఎంసీ 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, పార్టీ వార్డు అధ్యక్షుడు పాత్రకొండ ధర్మారావు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బాధితులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన సందర్భంగా వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం యువనాయకులు వెలగపూడి ప్రతాప్‌రుద్ర, పార్టీ వార్డు అధ్యక్షుడు యల్లమల్లి సురేశ్, క్లస్టర్ ఇన్‌చార్జి తురకపూడి బాలస్వామి, వడిసెల శ్రీను, నల్లాని వరలక్ష్మి, బాలరాజు, అడ్డూరి రమణ, ట్రావెల్స్ రాజు, గురుమూర్తి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రూ.39 లక్షలతో వంతెన విస్తరణకు శంకుస్థాపన

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని 18వ వార్డు ఎంవీపీ కాలనీ ఆరో సెక్టారు శివాలయం వద్ద ఇరుగ్గా ఉన్న వంతెనను విస్తరించడానికి రూ.39 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న నిర్మాణానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో వాహన రాకపోకలు ఎక్కువగా ఉన్నా, గెడ్డపై వంతెన ఇరుగ్గా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వంతెన విస్తరించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కార్పొరేటర్ గొలగాని మంగవేణి పోలారావు వినతి మేరకు, ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధికి నోచుకుంది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం, పార్టీ నాయకులు బుచ్చి లింగం, కారి రామారావు, కుమార్, శ్రీను, సత్యనారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



వంతెన విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

సేవా భావంతో పనిచేస్తేనే గుర్తింపు



కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న సూర్యప్రకాశ్

సిరిపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సేవా భావంతో క్లబ్‌లు పనిచేయాలని, ఆ దిశగా కృషిచేస్తున్న వారందరికీ అభినందనలు తెలియజేస్తున్నానని లయన్స్ జిల్లా గవర్నర్ డి.సూర్యప్రకాశ్ అన్నారు. సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో లయన్స్ జిల్లా 316ఏ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గవర్నర్ డి.సూర్యప్రకాశ్ సమక్షంలో లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ సుభాష్‌బాబు , పూర్వ డైరెక్టర్ విజయ్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా జిల్లా గవర్నర్ సూర్యప్రకాశ్‌కు అధికార బ్యాడ్జీ అందజేశారు. గాట్ ఏరియా లీడర్లు, ఆర్‌సీ జెడ్సీ టీమ్ లీడర్స్‌చే ప్రమాణ పత్రం చదివించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ సమాజంలో అవసరం ఉన్న వ్యక్తులను గుర్తించి సేవలందించాలన్నారు. పాస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు సుబ్బారాజు, బి.తిరుపతిరాజు, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ పి.చంద్రశేఖర్, కో కన్వీనర్లు వి.కోటేశ్వరరావు, ఎన్.వీఎస్ఎస్ ప్రసాదనాయుడు, క్యాబినెట్ సెక్రటరీ ట్రస్టీ ఎస్.ఉదయ్‌శంకర్, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ప్రతిభగల పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు.

టీడీఆర్ బాండ్లు వద్దని సీపీఎం వినతి



వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సిరిపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి నుంచి అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు, ఇల్లు, షాపులు కోల్పోతున్న నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు వద్దని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని వీఎంఆర్డీఏ చైర్మన్ఎం.వి.ప్రణవ్‌గోపాల్‌ను సీపీఎం నాయకులు కోరారు. సోమవారం వీఎంఆర్డీఏ భవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నేతలు బొడ్డు గంగారావు, ఆర్.రాము, కె.రామ సదాశివరావు, కర్రి అప్పారావు, బాబురావు మాట్లాడుతూ రహదారి విస్తరణలో ఇళ్లు పూర్తిగాపోతున్న వారికి ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. చిరు వ్యాపారులను నిర్వాసితులుగా పరిగణించి ప్యాకేజీ ఇవ్వాలన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ప్రణవ్ హామీ ఇచ్చారన్నారు.

బస్సులు కండిషన్‌లో ఉండాలి : ఆర్టీసీ ఆర్‌ఎం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అద్దెబస్సులు మంచి కండిషన్‌లో ఉండేలా చూడాలని, ప్రతి రోజూ పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు యజమానులను కోరారు. ద్వారకాబస్ స్టేషన్‌లోని ఆర్‌ఎం కార్యాలయంలో సోమవారం ఆయన అద్దెబస్సుల యజమానులతో సమావేశమయ్యారు. మార్గమధ్యలో బ్రేక్‌డౌన్ రాకుండా ఫిట్‌గా ఉంచాలని సూచించారు. ప్రయాణికులకు ఎండ వానల నుంచి రక్షణ కల్పించేలా, అసౌకర్యం లేకుండా కిటికీలు, గ్లాసులు ఆర్టీసీ గైడ్‌లైన్సుకు అనుగుణంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 15నుంచి మహిళలకు ఉచిత బస్సు రవాణా పథకం అమల్లోకి వస్తున్న దృష్ట్యా డ్రైవర్లకు తగు ఆదేశాలివ్వాలని సూచించారు. ప్రతి బస్టాపులోను బస్సులు ఆపాలని, మహిళలు బస్సెక్కిన తరువాత ముందుకు నడపాలని సూచించారు. మహిళలను భద్రంగా గమ్యం చేర్చేవిధంగా డ్రైవర్లకు సూచనలివ్వాలన్నారు. ప్రయాణికులు చేయి ఎత్తన ప్రతి చోటా బస్సులు ఆపి, వారిని ఎక్కించుకోవాలన్నారు. ఆర్టీసీ నుంచి ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్‌ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, డిప్యూటీ చీఫ్‌మెకానికల్ ఇంజనీర్ ఎ.గంగాధర్, అద్దె బస్సుల నియంత్రణాధికారి ఈఎస్ నాయుడు, అద్దె బస్సుల యజమానులు పాల్గొన్నారు.

న్యాయశాస్త్రానికి నిఘంటువు వడ్లమాని



శ్రీరామమూర్తి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ మద్ది నారాయణరెడ్డి

విశాఖలీగల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): న్యాయశాస్త్రానికి వడ్లమాని శ్రీరామమూర్తి నిఘంటువు లాంటి వారని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ మద్దినారాయణ రెడ్డి అన్నారు. జిల్లా కోర్టులోని సమావేశ మందిరంలో సోమవారం ఆయన వడ్లమాని చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. వడ్లమాని జూనియర్‌గా తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నానన్నారు. భాషా పాండిత్యం, న్యాయశాస్త్రంలోని మెలకువలు ఆయన సొంతమన్నారు. సుమారు 65 ఏళ్లపాటు విశాఖలో న్యాయవాదిగా సేవలందించారన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ సీనియర్ న్యాయవాది వ్యవస్థకు దిక్సూచి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు కేవీ రామ్మూర్తి, ఎం.రామదాసు, పీవీ నారాయణ రావు,డి.రమేష్, కె.రామజోగేశ్వరరావు, ఎండీ హబీబుల్లా, తదితరులు పాల్గొన్నారు.అంతకుముందు న్యాయవాదులు శ్రీరామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఆయుష్మాన్ భారత్ కార్డులపై ప్రచారం చేయాలి

- నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



ఎన్‌సీడీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మేయర్ పీలా శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఖాతా ప్రతి వ్యక్తికీ ఉండాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరం వద్ద సోమవారం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు ఏర్పాటు చేసిన ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) స్క్రీనింగ్ పరీక్షలతో పాటు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌పై జీవీఎంసీ ఉద్యోగులతో పాటు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుదారులకు అవగాహన కల్పించారు. జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌ను ప్రతి వ్యక్తి కలిగి ఉండాలని మేయర్ సూచించారు. హెల్త్ ఐడీ 14 నెంబర్లు ఉంటుందని, ఇందులో వ్యక్తి ఆరోగ్య పరీక్షలు, మందులు తదితర సమాచారాన్ని నిక్షిప్తం చేస్తారన్నారు. తద్వారా ఆరోగ్య సమస్యలు ఏర్పడినప్పుడు ఏ ఆస్పత్రికి వెళ్లి ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు చూపించినా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుంటుందన్నారు. జీవీఎంసీ సిబ్బందికి, పీజీఆర్ఎస్‌కు వచ్చిన అందరికీ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. డయాబెటిస్, హైపర్ టెన్షన్, క్యాన్సర్, నాన్ కమ్యూనికబుల్, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించగలిగితే మెరుగైన వైద్యం అందించేందుకు వీలుంటుందన్నారు. ఇటువంటి కార్యక్రమం జీవీఎంసీలో ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ప్రతి వార్డులో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసి నగరంలోని ప్రతి పౌరుడికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు అందేలా చూడాలని అధికారులను మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, డీపీఓ ఎన్‌హెచ్.యు.ఎం.శశిభూషణ్, ఏఎన్‌ఎంలు, ఇతర ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ ట్రోఫీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

వెంకోజీపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సూపర్ కిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీన నిర్వహించనున్న ఇన్విటేషనల్ ఏపీ స్టేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్ -2025 ట్రోఫీని సోమవారం తూర్పు ఎమ్మెల్యే ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ పి.శ్రీనివాస్ పట్నాయక్ మాట్లాడుతూ ఏయూ బాక్సింగ్ హాల్‌లో పోటీల్లో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి సీవోవో డాక్టర్ ఐ.పి.హెచ్.ప్రసాద్, క్లస్టర్ హెడ్ డాక్టర్ ఆదిత్య కౌరా, కిక్ బాక్సింగ్ అంతర్జాతీయ రిఫరీ జి.ఆనందబాబు, పోటీల చీఫ్ ఆర్గనైజర్ సీహెచ్ ప్రసాదరావు, ఆర్గనైజర్ సీహెచ్ ప్రశాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జోనల్ కార్యాలయానికి తాత్కాలిక రోడ్డు



రైల్వే జోనల్ కార్యాలయానికి వెళ్లేందుకు వేసిన మట్టి రోడ్డు

ఆరిలోవ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం సమీపంలోని ముడసర్లోవలో రైల్వే జోనల్ కార్యాలయం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ సామగ్రిని తరలించేందుకు వీలుగా తాత్కాలికంగా మట్టి రోడ్డును నిర్మించారు. విశాఖ కేంద్ర కారాగారం ప్రధాన గేటుకు ఎదురుగా ఉన్న సర్వీసు రోడ్డును ఆనుకుని సుమారు 30 అడుగుల వెడల్పుతో రోడ్డును వేశారు. అయితే ఇక్కడ వంద అడుగుల వెడల్పుతో శాశ్వత రోడ్డును నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం పనులకు ఆటంకం లేకుండా మట్టి రోడ్డును నిర్మించారు. అయితే వర్షాలు సమృద్ధిగా కురిస్తే ఈ రోడ్డుపై రాకపోకలకు అవకాశం ఉండదని, ఈ నేపథ్యంలో సీసీ రోడ్డును నిర్మిస్తేనే పనులు సజావుగా సాగుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీకి విశాఖ క్రీడాకారులు



విజేతలతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆల్ విశాఖ చెస్ సంఘం నేతృత్వంలో ఆదిత్య చెస్ అకాడమీ నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-17 ఓపెన్, బాలికల పోటీలు కమ్ జిల్లా జట్టు ఎంపికలు సోమవారం ముగిశాయి. నగరంలో జరిగిన ఈ టోర్నీ ఓపెన్ కేటగిరీలో జి.నైనా, తనీష్ చొప్రా...బాలికల విభాగంలో కుమారి ప్రసాద్ జాగృతి, సాయి దీప్తి శివకోటి తొలి రెండు స్థానాల్లో విజేతలుగా నిలిచారు. ఓపెన్, బాలికల విభాగాల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచినవారు ఆగస్టు 16, 17 తేదీల్లో కాకినాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆల్ విశాఖ చెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి సునీల్‌కుమార్, బాబూరావు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు ధ్రువపత్రాలు, ట్రోఫీలు అందజేసి అభినందించారు.

రైల్వేస్టేషన్‌లో అర్ధరాత్రి డీఆర్‌ఎం తనిఖీలు



స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న డీఆర్‌ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఎం లలిత్ బొహ్రా ఆదివారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్టేషన్‌లోని ప్రధానమైన స్లీపింగ్ పాడ్స్, హెరిటేజ్ రిటైరింగ్ రూమ్స్, టీటీఈ రెస్ట్ హౌస్, టికెట్ బుకింగ్ కార్యాలయాలను తనిఖీ చేశారు. రిజిస్టర్‌ను తనిఖీ చేసి విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు అక్కడికక్కడే కౌన్సెలింగ్ చేశారు. సదుపాయాల మెరుగుకు చేపట్టాల్సిన చర్యలపై సిబ్బంది అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. ప్రయాణికుల భద్రత, మౌలిక సదుపాయాల నిర్వహణతోపాటు సిబ్బంది శ్రేయస్సు కూడా యాజమాన్యానికి ముఖ్యమని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, ఫిర్యాదులలో వాస్తవాలను అంచనా వేసి సమస్యలు పరిష్కరించడంతోపాటు మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతామన్నారు. ఈ తనిఖీలలో సీనియర్ డీసీఎం కె.సందీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

న్యాయశాస్త్రానికి నిఘంటువు వడ్లమాని శ్రీరామమూర్తి



శ్రీరామమూర్తి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ మద్ది నారాయణరెడ్డి

విశాఖలీగల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): న్యాయశాస్త్రానికి వడ్లమాని శ్రీరామమూర్తి నిఘంటువు లాంటి వారని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ మద్దినారాయణ రెడ్డి అన్నారు. జిల్లా కోర్టులోని సమావేశ మందిరంలో సోమవారం ఆయన వడ్లమాని చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. వడ్లమాని జూనియర్‌గా తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నానన్నారు. భాషా పాండిత్యం, న్యాయశాస్త్రంలోని మెలకువలు ఆయన సొంతమన్నారు. సుమారు 65 ఏళ్లపాటు విశాఖలో న్యాయవాదిగా సేవలందించారన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ సీనియర్ న్యాయవాది వ్యవస్థకు దిక్సూచి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు కేవీ రామ్మూర్తి, ఎం.రామదాసు, పీవీ నారాయణరావు, డి.రమేష్, కె.రామజోగేశ్వరరావు, ఎండీ హబీబుల్లా, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు న్యాయవాదులు శ్రీరామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అప్పన్న నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కును ఈవో త్రినాథరావుకు అందజేస్తున్న డా.కె.సూర్యప్రకాశరావు కుటుంబ సభ్యులు

సింహాచలం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి మహారాణిపేట ప్రాంతానికి చెందిన డా.కె.సూర్యప్రకాశరావు, లక్ష్మీ దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. సోమవారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావుకు చెక్కు అందజేశారు. సంప్రదాయం ప్రకారం దాత కుటుంబానికి అంతరాలయ దర్శనం చేయించి, శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

జగదాంబ జంక్షన్‌లో రాజీవ్ విగ్రహం ఏర్పాటుకు వినతి



మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహారాణిపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జగదాంబ జంక్షన్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని మళ్లీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి కె.వి.సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. సోమవారం నగర కాంగ్రెస్ నాయకులు మేయర్ పీలా శ్రీనివాసరావును కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ రోడ్డు అభివృద్ధి నిమిత్తం రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని జగదాంబ జంక్షన్‌లో తొలగించారని, గతంలో అనేకసార్లు మేయర్, కమిషనర్‌లకు విజ్ఞప్తి చేసినా కనీస స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 20న రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు మేయర్ పీలా స్పందిస్తూ కమిషనర్‌తో మాట్లాడి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయిస్తామన్నారు. మేయర్‌ను కలిసినవారిలో కాంగ్రెస్ రాష్ట్ర స్పోర్ట్స్ విభాగం చైర్మన్ జీవీవీఎస్ కమలాకర్‌రావు, కస్తూరి వెంకటరావు, దండి ప్రియాంక, రామకృష్ణ, బాషా, దేవా, నూకరాజు, సత్యనారయణ, అప్పారావు తదితరులు ఉన్నారు.

శ్రీరంగపురం పాఠశాల భవనం దుస్థితిపై కార్పొరేటర్ ఫిర్యాదు

మహారాణిపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేటలోని శ్రీరంగపురం ప్రాథమిక పాఠశాల భవనం ప్రమాదకరంగా ఉందని జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వార్డు కార్పొరేటర్ యు.నారాయణరావు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ గోకుల్ బీచ్ పార్కు ఎదురుగా ప్రాథమిక పాఠశాల భవనం నిర్మించి 40 ఏళ్లు దాటిపోయిందని తెలిపారు. ఇటీవల యూనివర్సిటీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీలలో పాఠశాల భవనం ప్రమాదకర పరిస్థితిలో ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. నిధులు లేక మరమ్మతులు జరగలేదని, ఏ క్షణంలో కూలిపోతుందో తెలియదని ఆందోళన వ్యక్తంచేశారు. భవనం దుస్థితిలో ఉండడంతో గత మూడేళ్లలో తొమ్మిది మంది విద్యార్థులు మాత్రమే చేరారని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతుల చేపట్టాలని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు.



శ్రీరంగపురం ప్రాథమిక పాఠశాల భవనం దుస్థితి

కమ్మేస్తున్న పోర్టు కాలుష్యం

- పరిసర ప్రాంతాలను చుట్టేస్తున్న ధూళి
- బొగ్గు నిల్వలతో సమస్య జటిలం
- వ్యాధులు చుట్టుముట్టి నరకయాతన
- కోట వీధి, చిలకపేట, జాలారిపేట ప్రాంతాల్లో దారుణ పరిస్థితి



పోర్టులో బొగ్గు నిల్వలపై అరకొరగా కప్పిన టార్పాలిన్లు



కన్వేయర్ బెల్టుద్వారా బొగ్గు వెళ్తుండగా వెలువడుతున్న ధూళి

బీచ్ రోడ్డు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పోర్టు కాలుష్యంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా బొగ్గు నిల్వల కారణంగా ఎగసిపడిన దుమ్ము, ధూళితో రంగుమారిపోతున్నామని వాపోతున్నారు. నిత్యం నరకయాతన అనుభవిస్తున్నామని, వ్యాధుల బారిన పడి అల్లాడుతున్నామని గగ్గోలుపెడుతున్నారు. కాలుష్యం నుంచి రక్షణ కల్పించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకున్నా ఫలితం కనిపించకపోవడంతో ఏళ్లుగా సమస్యలతో సావాసం చేస్తున్నామంటున్నారు. దీనికితోడు బొగ్గును లారీలతో రవాణా చేస్తుండడంతో ధూళి ఎగసిపడి ఉక్కిరిబిక్కిరవుతున్నామంటున్నారు నగరం చుట్టుపక్కల విరివిగా పరిశ్రమలు నెలకొల్పడంతో వాటికి అవసరమైన బొగ్గును విదేశాలనుంచి దిగుమతి చేసుకొని పోర్టులో గుట్టలుగా పోస్తుంటారు. వాటిపై టార్పాలిన్లు కప్పి, బొగ్గు, ధూళి బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలి. కానీ పోర్టు యాజమాన్యం గుట్టలపై సగం వరకు మాత్రమే టార్పాలిన్లు కప్పి, మిగతా వాటిని వదిలేస్తోంది. దీనివల్ల సముద్రం మీదుగా వచ్చే గాలుల్లో బొగ్గు, ధూళి కలిసిపోయి పాత నగరం మొత్తాన్ని కమ్మేస్తోంది. ముఖ్యంగా కోటవీధి, జాలారిపేట, వెలంపేట, ప్రసాద్ గార్డెన్స్, రెల్లి వీధి ప్రాంతాలు బొగ్గు ధూళితో నిండిపోతున్నాయి. దీంతో వ్యాధుల బారిన పడి విలవిల్లాడుతున్నారు.

రోగాల బారిన ప్రజలు...

బొగ్గు కాలుష్యంతో స్థానికులు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. ఆస్మా, ఆయాసం, గుండె, కంటి వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఊపిరితిత్తులు, శ్వాసకోస వ్యాధులు మరింత ప్రబలే ప్రమాదం ఉందంటున్నారు. బొగ్గు లారీల వెనుక వెళ్లే పాదాచారులు ద్విచక్ర వాహనదారులు ముక్కుకు మాస్కులు కట్టుకుని వెళ్లాల్సి వస్తోంది.

ఏళ్లుగా నరకం చూస్తున్నాం



బొగ్గు లారీల కాలుష్యంతో ఏళ్లుగా నరకం చూ స్తున్నాం. ధూళి ఇళ్లల్లోకి రావడంతో ఉండలేని పరిస్థితి. శ్వాస, కంటి, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. లారీల నుంచి బొగ్గు రాలకుండా చర్యలు తీసుకోవడం లేదు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోవడం లేదు.

- నూకాలమ్మ, కోట వీధి

సమస్య పరిష్కరించాలి



ఎన్నికల ముందు వివిధ రాజకీయ పార్టీల నేతలు హామీలిస్తున్నారు. సమస్యలు తీర్చేవారే కనిపించడం లేదు. వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. మరోచోటకు వెళ్లిపోవడం మంచిదేనన్న అభిప్రాయం ఉంది. పోర్టు కాలుష్యంపై కలెక్టర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు.

- బర్రి కొండబాబు, జాలారిపేట

ఇలా చేస్తే మేలు...

- రహదారులకు ఇరువైపులా బొగ్గు నుసితో కలిసిపోయిన ఇసుక మేటలను తక్షణం తొలగించాలి.
- కాలం చెల్లిన లారీలతో పాటు డోర్లు దెబ్బ తిన్న లారీలను రవాణాకు వినియోగించకూడదు.
- పల్లపు ప్రాంతాలు, మలుపుల వద్ద లారీలను అతి వేగంగా నడపడంతో బొగ్గు రాలి పడిపోతోంది. వేగం తగ్గించడంతోపాటు శిథిల రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.
- నీటితో తడిపిన అనంతరం బొగ్గును లారీల్లో లోడ్ చేస్తే పొడి అక్కడే రాలిపోతోంది.
- పరిమితి మించి లోడ్‌తో రాకపోకలు సాగించే లారీలపై చర్యలు తీసుకోవాలి.
- లారీలనుంచి బొగ్గు రాలకుండా టార్పాలిన్‌ను పటిష్ఠంగా కట్టాలి.
- అసంపూర్తిగా ఉన్న రైల్వే ట్రాక్ వద్ద సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేయాలి.

చిన్నారుల ఎదుగుదలకు తల్లిపాలే కీలకం



మాధవధార మహత్‌కాలనీలో అంగన్వాడీ కార్యకర్తల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ఆర్.వెంకటరమణ తదితరులు

మాధవధార, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పసికందు పుట్టిన తొలి గంటలో తల్లి అందించే ముర్రుపాలే చిన్నారుల ఎదుగుదలకు మేలు చేస్తాయని 51వ వార్డు కార్పొరేటర్ ఆర్.వెంకటరమణ పేర్కొన్నారు. నేటి తరం మహిళలు తల్లిపాలు అందివ్వడంలో ఐసీడీఎస్ పోషణ ప్రమాణాల్ని పాటించాలని కోరారు. సోమవారం వార్డులోని గాంధీనగర్ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. అన్ని పోషకాలు ఉండే తల్లిపాలే బిడ్డలకు జీవితకాల వ్యాధి నిరోధక శక్తిని అందిస్తాయని అన్నారు. అర్బన్-1 ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో కె.నీలిమ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు అందించారు. అంగన్వాడీ ప్రాముఖ్యతను తెలుపుతూ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సెక్టర్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్ మౌలా బీబీ, ఆశ, ఏఎన్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీకి విశాఖ క్రీడాకారులు



విజేతలతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆల్ విశాఖ చెస్ సంఘం నేతృత్వంలో ఆదిత్య చెస్ అకాడమీ నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-17 ఓపెన్, బాలికల పోటీలు, జిల్లా జట్టు ఎంపికలు సోమవారం ముగిశాయి. నగరంలో జరిగిన ఈ టోర్నీ ఓపెన్ కేటగిరీలో జి.నైనా, తనీష్ చోప్రా...బాలికల విభాగంలో కుమారి ప్రసాద్ జాగృతి, సాయి దీప్తి శివకోటి తొలి రెండుస్థానాల్లో విజేతలుగా నిలిచారు. ఓపెన్, బాలికల విభాగాల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచినవారు ఆగస్టు 16, 17 తేదీల్లో కాకినాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి సునీల్‌కుమార్, బాబూరావు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు ధ్రువపత్రాలు, ట్రోఫీలు అందజేసి అభినందించారు.

200 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు కిశోర్‌కుమార్

అక్కయ్యపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దిన వేడుకలు జరుపుకోబోతున్న నేపథ్యంలో గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం 200 అడుగుల జాతీయ పతాకంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీడీ రత్నం, ఉపాధ్యాయులు ఎంఎన్‌వీ విశ్వనాథం, రోటరీ క్లబ్ ప్రతినిధులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ధ్రువపత్రాల పంపిణీ



ఎన్‌సీసీ క్యాడెట్లతో ప్రిన్సిపాల్ తదితరులు

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శిక్షణ పూర్తి చేయడంతోపాటు సంబంధిత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి 'బి' సర్టిఫికెట్ పొందిన ఎన్‌సీసీ క్యాడెట్లకు విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో సోమవారం ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ముఖ్య అతిథిగా హాజరై క్యాడెట్లను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ పొందడం ద్వారా క్రమశిక్షణ, శారీరక, మానసిక స్థైర్యం పెంపొందడమే కాకుండా దేశానికి విశేష సేవలందించే అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఎన్‌సీసీ 'బి' సర్టిఫికెట్‌కు అత్యంత ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె.గీతాంజలి మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయత, సేవాభావం, క్రమశిక్షణ పాటించి 'బి' సర్టిఫికెట్ పొంది కళాశాల గౌరవాన్ని పెంచారని కొనియాడారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్మయి, డి.అరుణ పద్మ, డాక్టర్ ఎల్.శరణ్య పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో అర్ధరాత్రి డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు



రెస్ట్‌రూమ్ వద్ద డీఆర్ఎం లలిత్ బొహ్రా తదితరులు

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వేస్టేషన్‌లో డీఆర్ఎం లలిత్ బొహ్రా ఆదివారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్టేషన్‌లోని ప్రధానమైన స్లీపింగ్ పాడ్స్, హెరిటేజ్ రిటైరింగ్ రూమ్స్, టీటీఈ రెస్ట్ హౌస్, టికెట్ బుకింగ్ కార్యాలయాలను తనిఖీ చేశారు. రిజిస్టర్‌ను తనిఖీ చేసి విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు అక్కడికక్కడే కౌన్సెలింగ్ చేశారు. సదుపాయాల మెరుగుకు చేపట్టాల్సిన చర్యలపై సిబ్బంది అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. ప్రయాణికుల భద్రత, మౌలిక సదుపాయాల నిర్వహణతోపాటు సిబ్బంది శ్రేయస్సు కూడా యాజమాన్యానికి ముఖ్యమని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, ఫిర్యాదులలో వాస్తవాలను అంచనా వేసి సమస్యలు పరిష్కరించడంతోపాటు మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతామన్నారు. తనిఖీలలో సీనియర్ డీసీఎం కె.సందీప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఐదున్నర దశాబ్దాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వారంతా 55 సంవత్సరాల (ఐదు దశాబ్దాల) తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు గుర్తుపట్టలేనంతగా...మారినప్పటికీ...చిన్ననాటి ముద్దుపేర్ల ద్వారా గుర్తుతెచ్చుకొని మురిసిపోయారు. డాబాగార్డెన్స్‌లోని ఓ హాల్‌లో 1970-1971లో పదో తరగతి చదివిన హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ గాంధీగ్రామ్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు 40 మంది ఆత్మీయ సమావేశం జరుపుకున్నారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి కలిసిన వీరంతా పాఠశాల విద్యార్థులుగా మారిపోయారు. ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు, కుటుంబం, పిల్లలు, ప్రస్తుత పరిస్థితులపై సంభాషించుకున్నారు. పదో తరగతి విద్యార్థి దశలో గురువులు చెప్పిన అనేక రకాల మంచి విషయాలను జీవన విధానానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గుర్తుకు తెచ్చుకున్నారు. పద్యాలాపన, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమానికి మల్ల అన్నపూర్ణ, కర్రి పద్మారావు, పీటీకే ఆనంద్, చైతన్య దళాయి, కె.వేంకటేశ్వరరావు, నందూరివెంకటేశ్వర్లు ఆర్గనైజర్లుగా వ్యవహరించగా, ఎం.వి.రాజశేఖర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తాం

- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు కె.వెంకటలక్ష్మి స్పష్టీకరణ



మర్రిపాలెంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సెల్‌ఫోన్‌లు పట్టుకొని ఆందోళన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

మర్రిపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): 'నో ఫోన్.. నో వర్క్' పేరిట ఆన్‌లైన్ సేవలను బహిష్కరించిన అంగన్‌వాడీలు ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్దనున్న ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సోమవారం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు (సీఐటీయూ) కె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యాప్‌ల పనిభారంతో సతమతమవుతుంటే, అదనంగా ఆరోగ్యశాఖకు చెందిన ప్రధాన మంత్రి మాతృత్వవందన యోజన ద్వారా ఏఎన్ఎం, ఆశా వర్కర్లు చేయవలసిన గర్భిణులు, బాలింతల నమోదు ప్రక్రియ సైతం తమకే అప్పగించి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వర్ పనిచేయక సెల్‌ఫోన్‌లు మొరాయిస్తే లబ్ధిదారులు తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారని, కిశోర్‌వికాస్, మిషన్ వాత్సల్య, సఖి గ్రూప్‌లుగా ఏర్పాటు చేసి అందులో స్థానిక నాయకులను, సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసి ప్రతి మూడో శుక్రవారం సమావేశం నిర్వహించాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని చెప్పిన ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ ఏడాదిన్నర కావస్తున్నా అంగన్వాడీల వేతనాలపై స్పందించలేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో 'నో ఫోన్..నో వర్క్' విధానాన్ని పాటిస్తామన్నారు. లబ్ధిదారుల సౌకర్యార్థం ఆఫ్‌లైన్ విధానంలో రేషన్ అందిస్తామన్నారు. అనంతరం సీడీపీఓ నీలిమకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, సీఐటీయూ గౌరవ అధ్యక్షులు మణి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ నాయకులు పిశ్యామలదేవి, పి.కృపారాణి, ఎ.నూకరత్నం, అన్నపూర్ణ, దేవ, సుబ్బలక్ష్మి, సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణకు వాల్తేరు రైల్వే భరోసా



పని ప్రదేశంలో వేధింపులపై ఉద్యోగినులను ఆరా తీస్తున్న పర్యవేక్షక బృందం

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్‌లోని పని ప్రదేశంలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా వాల్తేరు రైల్వే విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. డీఆర్ఎం లలిత్ బొహ్రా, సీనియర్ డీపీవో కబీర్ అన్సారీ మార్గదర్శకాల మేరకు డివిజన్ వ్యాప్తంగా నాలుగు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి పని ప్రదేశాల్లో ఉద్యోగినులతో మాట్లాడి లైంగిక వేధింపుల చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. మహిళా ఉద్యోగులలో విశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు ఏ రకమైన వేధింపులు ఎదుర్కొన్నా ముందుకు వచ్చి తెలియజేయాలని కోరుతున్నామన్నారు. వేధింపులపై సదస్సులు, వర్కుషాపులు నిర్వహించి చట్ట నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైల్వే ప్రాంగణాల్లో దీనికి సంబంధించి పోస్టర్, కరపత్రాల ప్రదర్శన చేస్తున్నామన్నారు. ప్రత్యేక కమిటీ సభ్యులు పని ప్రదేశాలకు వెళ్లి బాధితులకు మద్దతివ్వడం, గోప్యత పాటించి అంతర్గత ఫిర్యాదుల కమిటీ ద్వారా ఫిర్యాదులు స్వీకరించడంపై దృష్టి సారిస్తున్నారని తెలిపారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు తగిన భద్రతతోపాటు ఎటువంటి భయం లేకుండా విధులు నిర్వహించే వాతావరణం కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు.

బస్సులు కండిషన్‌లో ఉండాలి : ఆర్టీసీ ఆర్ఎం

ద్వారకాబస్‌స్టేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అద్దెబస్సులు మంచి కండిషన్‌లో ఉండేలా చూడాలని, రోజూ పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు యజమానులను కోరారు. ద్వారకాబస్‌స్టేషన్‌లోని ఆర్ఎం కార్యాలయంలో సోమవారం ఆయన అద్దెబస్సుల యజమానులతో సమావేశమయ్యారు. మార్గమధ్యలో బ్రేక్‌డౌన్ రాకుండా ఫిట్‌గా ఉంచాలని సూచించారు. ప్రయాణికులకు ఎండ వానల నుంచి రక్షణ కల్పించేలా, అసౌకర్యం లేకుండా కిటికీలు, గ్లాసులు ఆర్టీసీ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు రవాణా పథకం అమల్లోకి వస్తున్న దృష్ట్యా డ్రైవర్లకు తగు ఆదేశాలివ్వాలని సూచించారు. ప్రతి బస్టాపులోను బస్సులు ఆపాలని, మహిళలు బస్సెక్కిన తరువాత ముందుకు నడపాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్‌ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి, డిప్యూటీ చీఫ్‌మెకానికల్ ఇంజనీర్ ఎ.గంగాధర్, అద్దె బస్సుల నియంత్రణాధికారి ఈఎస్ నాయుడు, యజమానులు పాల్గొన్నారు.

ఉక్కుకు మంచి రోజులు

... 5వ పేజీ తరువాయి

నోటిఫికేషన్ ఇచ్చి, ఆపేశారు. అప్పటి నుంచి కొత్తగా ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదు. నష్టాలు, ఆర్థిక ఇబ్బందులు, ఉత్పత్తి వ్యయం తగ్గింపు పేరుతో ఉద్యోగులు, కాంట్రాక్టు వర్కర్ల సంఖ్య తగ్గించుకుంటూ వచ్చారు. ఇప్పుడు శాశ్వత ఉద్యోగులు 10,200 మంది మాత్రమే ఉన్నారు. వారిలో ఎగ్జిక్యూటివ్స్ 3,200 మంది కాగా మిగిలినవారు నాన్ ఎగ్జిక్యూటివ్స్. కాంట్రాక్టు వర్కర్లు ఎనిమిది వేల మందే ఉన్నారు. వీరితో 100 శాతం ఉత్పత్తి సాధ్యం కాదనేది అందరికీ తెలిసినా ఖర్చులు తగ్గించాలని మౌనంగా ఉన్నారు. ఇలా నడిపితే ప్లాంటు మూతపడే ప్రమాదం ఉండడంతో తక్షణమే కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని ఎంపీ శ్రీభరత్ కోరారు.

50 శాతం ఉద్యోగులు నిర్వాసితులకే

కూటమి ప్రభుత్వం వస్తే నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తుందని పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. దానిని నిలుపుకొనే దిశగా ఇప్పుడు ప్రయత్నిస్తున్నారు. ప్లాంటులో కొత్తగా టెక్నికల్ ఉద్యోగాలు ఏమైనా తీస్తే అందులో 50 శాతం నిర్వాసితులకు కేటాయిస్తున్నారు. ఇప్పుడు ఆ విధంగానే నిర్వాసితులకు అవకాశం కల్పించాలని ఎంపీ శ్రీభరత్ కోరారు. స్టీల్ ప్లాంటులో ఇంకా ఎనిమిది వేల మందికి ఉపాధి కల్పించాల్సి ఉంది. అలాగే ఇటీవల తొలగించిన కాంట్రాక్టు వర్కర్లను తిరిగి తీసుకోవాలని ఆయన మంత్రిని అడిగారు.

విద్యాలయాలపైనా చర్చ

స్టీల్‌ప్లాంటులో కేంద్రీయ విద్యాలయం ఉంది. దానిని కేంద్ర విద్యా శాఖ పరిధిలోకి మార్చాలని ఎంపీ కోరారు. అదేవిధంగా విమల విద్యాలయం సిబ్బందికి స్వచ్ఛంద పదవీ విరమణ పథకం అమలు చేయాలని, ఆర్థిక భద్రత కల్పించాలని కోరారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా!?

... 5వ పేజీ తరువాయి

శాస్త్రవేత్తలు పసిగట్టేస్తారు. కేసు తీవ్రతరమవుతుంది. అందుకని పేరు బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. అధికారులు ఎవరి స్థాయిలో వారు సహకరిస్తున్నారు.

ఇవన్నీ లోపాలే

- ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం ఇవ్వలేదు.
- ఏ ఉత్పత్తి తయారీలో, ఎక్కడ ప్రమాదం జరిగిందో వెల్లడించలేదు.
- సిబ్బందికి పీపీఈ కిట్లు ఇవ్వకుండా సాధారణ మాస్కులే ఇచ్చారు.
- విష వాయువులు లీకైతే గుర్తించే సిస్టమ్ లేదు.
- ఉత్పత్తికి సంబంధించి ఏ ప్రమాదాలు జరుగుతాయి? వాటిని ఎలా నిరోధించాలి? అనే హజార్డ్స్ ప్లాన్ ఉండాలి. అది కూడా లేదు. దానిపై సిబ్బందికి అవగాహన కల్పించలేదు.
- ఘటన జరిగిన 18 గంటల తరువాత కూడా ఏ వాయువు, ఎక్కడ లీకైందో గుర్తించలేదు.

పారదర్శకంగా భూ సమీకరణ

... 5వ పేజీ తరువాయి

రైతుబజార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. కొత్త రైతుబజార్ల ఏర్పాటుకు స్థలాలు ఎంపిక చేశామని తెలిపారు. ఆరిలోవ రైతుబజార్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మధురవాడ రైతుబజార్ ఎదురుగా ఉన్న ఆక్రమణలు తొలగించాలని జీవీఎంసీకి లేఖ రాశామని జేసీ తెలిపారు. ఎండీయూల రద్దు తరువాత రేషన్ డిపోల ద్వారా బియ్యం పంపిణీ గాడిలో పడిందని, చిన్నచిన్న ఇబ్బందులు ఏమైనా ఉంటే పరిష్కస్తామని పేర్కొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌పై చల్లారని అసమ్మతి

... 5వ పేజీ తరువాయి

ఏడాది మాత్రమే ఉన్నందున ఇప్పుడు అవిశ్వాసం పెట్టి పార్టీని ఇరకాటంలో పెట్టడం కంటే మధ్యేమార్గంగా ఆలోచన చేయాలని భావిస్తున్నట్టు కొందరు సభ్యులు అంతర్గత సంభాషణలలో చర్చించుకున్నారు. మంగళవారం నాటి సమావేశం తరువాత సభ్యులందరితో మరోసారి విశాఖలో సమావేశం ఏర్పాటుచేయాలని పార్టీ సీనియర్ నేతలు భావిస్తున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు తీవ్ర పోటీ

... 5వ పేజీ తరువాయి

రెండు రోజుల్లో సమాచారాన్ని అందించనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో నోటిఫికేషన్ ఇవ్వడంతో రాష్ట్రానికి చెందినవారే కాకుండా హైదరాబాద్ వంటి ప్రాంతాలకు చెందినవారు కూడా దరఖాస్తు చేసుకున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీగా ఎంపికైన అభ్యర్థులు వారానికి మూడు నుంచి నాలుగు తరగతులు బోధించాల్సి ఉంటుంది. అందుకుగాను ఆరు నెలలకు రూ.45 వేలు చొప్పున చెల్లించనున్నారు. ఈ పోస్టులకు పూర్తిస్థాయిలో సమయాన్ని వెచ్చించాల్సిన అవసరం లేకపోవడంతో అనేక రంగాలకు చెందినవారు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇప్పటికే వర్సిటీలోని వివిధ విభాగాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన అధ్యాపకులు కూడా ఉన్నారు. ఇలా పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఆరుగురు వరకు ఇంటర్వ్యూలకు హాజరైనట్టు తెలిసింది. అలాగే, గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తూ పీహెచ్‌డీ అర్హత ఉన్న కొందరు దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణలోని హైదరాబాద్ ప్రాంతానికి చెందినవారు కూడా పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. అయితే, రిటైర్డ్ ఉద్యోగులు, సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది, తెలంగాణకు చెందిన వారి దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవడం పట్ల కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పదవీ విరమణ చేసిన వారిని, ఇతర ఉద్యోగాలు చేస్తున్న వారిని ఇంటర్వ్యూలకు పిలవడం దారుణమంటున్నారు. దీనిపై అధికారులు మాత్రం స్పందించడం లేదు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

» రూ.2 కోట్లతో నిర్మించనున్న కల్వర్టు పనులకు శంకుస్థాపన



76వ వార్డులో కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతోందని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 76వ వార్డులోని అన్ని కాలనీల కాలువలను అనుసంధానం చేసేందుకు రూ.రెండు కోట్లతో గోపాలరెడ్డినగర్ వద్ద నిర్మించనున్న కల్వర్టు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనగా నిర్మించనున్న ఈ కల్వర్టు పనులు పూర్తయితే ఈ ప్రాంతానికి ముంపు భయం ఉండదని పల్లా పేర్కొన్నారు. టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డులోని లోతట్టు ప్రాంతాల్లోని కాలువలను సరిచేయడం జరిగిందని, డ్రైనేజీలను ఆధునీకరించడం, విస్తరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జడ్సీ బీఆర్ఎస్ శేషాద్రి, టీడీపీ వార్డు అధ్యక్షుడు జిత్తుక అప్పలరాజు, కార్యదర్శి కూన వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

లంకా మైదానంలో వినాయక ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన 'పల్లా'

గాజువాక: ఇక్కడి లంకా మైదానంలో భారీ వినాయక విగ్రహ ఏర్పాట్లను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పరిశీలించారు. గత 16 ఏళ్లగా ఇక్కడ భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి గాజువాకకు మంచిపేరు తీసుకువచ్చారని, ఈ ఏడాది కూడా మరింత ఘనంగా గణేశుని ఉత్సవాలను నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. అలాగే బారికేడ్లను ఏర్పాటు చేయాలని, భక్తులకు తాగునీటిని అందించడంతో పాటు భద్రతాపరమైన చర్యలు చేపట్టాలని పల్లా పేర్కొన్నారు. ఉత్సవ నిర్వాహక కమిటీ చైర్మన్ గణేశ్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టీడీపీ 70వ వార్డు అధ్యక్షుడు చట్టి గోపి, స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

చెత్త కుండీల్లో పేరుకుపోతున్న కోళ్ల వ్యర్థాలు

భరించరాని దుర్వాసనతో సతమతమవుతున్న పరిసర ప్రాంతాల ప్రజలు



రోడ్డు పక్కన ఉన్న డంపర్ బిన్‌లో కోళ్ల వ్యర్థాలు

మల్కాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న చికెన్ విక్రయదారులు సమీపంలోని చెత్త కుండీల్లో కోళ్ల వ్యర్థాలను ఇష్టానుసారంగా పడేస్తున్నారు. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లో భరించలేని దుర్వాసన రాజ్యమేలుతోంది. రోజంతా వ్యాపారం చేసి రాత్రిపూట కోళ్ల వ్యర్థాలను పడేస్తుండడం... అవి పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పూట వ్యాపారం మరీ ఎక్కువగా ఉంటుండడంతో సోమవారం ఉదయానికి డంపర్ బిన్లలో కోళ్ల వ్యర్థాలు రోజూకంటే అధికంగా దర్శమిస్తున్నాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎంత హెచ్చరించినా చికెన్ దుకాణదారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో చెత్త తరలించేటప్పుడు తాము కూడా దుర్వాసనను భరించలేకపోవుతున్నామని పలువురు పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. ముఖ్యంగా శ్రీహరిపురం మార్కెట్ ప్రాంతంలో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. ఈ మార్కెట్ వద్దనున్న చెత్త కుండీల్లో కుళ్లిన చేపలు, వ్యర్థాలను కూడా పారవేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పలు వార్డుల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'



65వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, తదితరులు

పెదగంట్యాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం పలు వార్డుల్లో నిర్వహించారు. ఇందులో భాగంగా 65వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాజీవ్ రోడ్డు, భానోజీ కాలనీ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు రట్టి వాసు, పలువురు నాయకులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి గెంజిపేట, వినాయకనగర్ ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దాముదోతి అర్జున్, తురసాల శ్రీనివాసరావు, పి.వరాహనరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని టీడీపీ 70వ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావు అన్నారు. వార్డు పరిధిలోని శ్రీనివాస నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి-సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డేడ రమణ, పీఎంఎల్ నాయుడు, పీబీఎల్ మూర్తి, ఎస్.రాజా, టీవీ కృష్ణ, యు.అప్పారావు, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.



70వ వార్డులో కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



నాగేంద్రకాలనీలో బాలింతలు, గర్భిణులకు సూచనలిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తల్లిపాలే బిడ్డకు ఎంతో ఆరోగ్యకరం

పలు ప్రాంతాల్లో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాల నిర్వహణ

గోపాలపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చంటిపిల్లలకు తల్లిపాలే ఎంతో ఆరోగ్యకరమని, తల్లిపాలను తాగడం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సిబ్బంది పేర్కొన్నారు. స్థానిక నాగేంద్రకాలనీ సచివాలయంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఐసీడీఎస్ సిబ్బంది మాట్లాడుతూ చంటిపిల్లలకు కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలు పట్టాలని బాలింతలు, గర్భిణులకు సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బెహరా నర్సింగ్ విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ పోషకాహారమని, పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలివ్వడం ద్వారా పోషక విలువలు గల ఆహారాన్ని అందించినట్టవుతుందని పల్లిపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం డి.స్వర్ణలత అన్నారు. జాలరి పల్లిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలిస్తే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి బి.నీలవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.దుర్గమ్మ, పి.శాంతి, దేవుడమ్మ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

9న వేంకటేశ్వరగిరి ప్రదక్షిణ

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 9న పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. గిరి ప్రదక్షణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని అర్చకులు ఆకాంక్షించారు. గిరి ప్రదక్షణలో పాల్గొనే భక్తులు తమతో పాటు టార్చిలైట్లను తీసుకురావాలని సూచించారు.

నడుపూరు రోడ్డులో వ్యర్థాల తొలగింపు

పెదగంట్యాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నడుపూరు ప్రధానగెడ్డలోని పూడిక, చెత్తాచెదారాన్ని తీసి బీసీ రోడ్డు పక్కన వేసిన జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ అధికారులు సోమవారం వాటిని తొలగించారు. బీసీ రోడ్డు పక్కన వేసిన ఈ వ్యర్థాల వల్ల స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి జీవీఎంసీ అధికారులకు దృష్టికి తీసుకువెళ్లడంతో వాటిని తొలగించే పనులు చేపట్టారు. జోన్ ప్రజారోగ్యశాఖ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.

87వ వార్డులో అభివృద్ధి పనుల పరిశీలన

కూర్మన్నపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ పరిధి కణితి, గణేశ్‌నగర్‌లలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం కార్పొరేటర్ బొండా జగన్ పరిశీలించారు. ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని, ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతను స్థానికులు కూడా పరిశీలించి కాంట్రాక్టర్లతో పనులు బాగా చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, ప్రగడ దానయ్య, వి.రాంబాబు, డీవీ అప్పారావు, ఎస్.పెంటారావు, కె.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్యారేజీ బాక్సుల వితరణ

మల్కాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలు చేయడంలో ఎంతో సంతృప్తి ఉందని కోరమాండల్ ఎరువుల కర్మాగారం అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కేవీవీవైఎస్ నారాయణ అన్నారు. సోమవారం నారాయణ తండ్రి కేవీవీబీఎల్ గుప్తా జయంతిని పురస్కరించుకుని జీవీఎంసీ పాఠశాలలో విద్యార్థులకు లంచ్ పెట్టుకునేందుకు క్యారేజీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను మరింత విస్తరింపజేస్తామని పేర్కొన్నారు.

మేయర్ పీలా శ్రీనివాసరావుకు కార్పొరేటర్ల వినతులు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ నుంచి చుక్కవానిపాలెం, షీలానగర్ మీదుగా జాతీయ రహదారిని కలుపుతున్న రోడ్డును రూ.రెండు కోట్లతో విస్తరింపజేయాలని మేయర్ పీలా శ్రీనివాసరావుకు 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కోరుతూ సోమవారం నగరంలో వినతిపత్రం అందజేశారు. ఆటోనగర్ నుంచి షీలానగర్‌కు ఉన్న ఈ రహదారిలో వందలాది మంది కార్మికులతో పాటు స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉండే ఈ రోడ్డును విస్తరించాలని విజ్ఞప్తి చేశారు.

వేపగుంట: జీవీఎంసీ 94వ వార్డులో డ్రైన్లు, రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ మేయర్ పీలా శ్రీనివాసరావుకు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే సింహాచలంలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నదని, ఇతర ప్రాంతాల్లో పట్టిన కుక్కలను సింహాచలం పరిసరాల్లో వదిలేస్తున్నారని, వాటికి వ్యాక్సినేషన్ చేయాలని కోరుతూ 98వ వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు.

రహదారి పనులను పరిశీలించిన కార్పొరేటర్

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు కాకానీనగర్ కాలనీలో రూ.46 లక్షలతో చేపడుతున్న జాతీయ రహదారికి అనుసంధానంగా వేసే రోడ్ల పనులను వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ సోమవారం పరిశీలించారు. కాలనీలోని లోతట్టు ప్రాంతంలో చిన్న పాటి వర్షానికి నీరు నిలిచిపోతోందని, అందుకు రోడ్డును ఎత్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'ములగాడ రోడ్డును అభివృద్ధి చేయాలి'

మల్కాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 58వ వార్డు ములగాడ నుంచి షీలానగర్ పోర్టురోడ్డును అభివృద్ధి చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారా వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, పోర్టు అథారటీస్ చైర్మన్, మేయర్‌కు వారు వినతి పత్రాన్ని సోమవారం అందించారు. సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ ఈ రహదారికి ఇరువైపులా విద్యుత్ దీపాలు పెట్టాలని కోరారు. అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పైడిరాజు, లక్ష్మణమూర్తి, పెంటరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ బస్సుల యజమానులతో ట్రాఫిక్ ఏడీసీపీ భేటీ

గాజువాక, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బస్సు యజమానులందరూ తమ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చూడాలని ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం గాజువాక క్లబ్‌లో ఫార్మాసిటీ బస్సుల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులను ఇష్టానుసారంగా రోడ్లపై నిలపరాదని, ఇతర వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ బస్సులను పార్కింగ్ చేస్తున్నారని, నిర్దేశిత ప్రాంతంలోనే వాటిని పార్కింగ్ చేసుకోవాలన్నారు. ఒకేసారి అన్ని బస్సులు రహదారిపైకి రావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాజువాక, స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ సీఐలు కోటేశ్వరరావు, వెంకటరావు పాల్గొన్నారు.

75వ వార్డులో కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి



75వ వార్డులో నిర్మించిన కల్వర్టు

పెదగంట్యాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డు పరిధిలో శీకువానిపాలెం, సీతానగరం గ్రామాలకు చెందిన కాలువలను నడుపూరు ప్రధాన గెడ్డకు అనుసంధానం చేసే కల్వర్టు పనులు పూర్తయ్యాయి. రూ.50 లక్షలతో జీవీఎంసీ దీనిని నిర్మించింది. శీకువానిపాలెం, సీతానగరం గ్రామాలకు చెందిన మురుగు నీరు దిగువకు పోయేందుకు వీలుగా అవుట్‌లెట్లు లేకపోవడంతో వల్ల ఏ మాత్రం వర్షం కురిసినా కాలువలు పొంగి రహదారిపై మురుగు, చెత్తాచెదారం చేరుతుండడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయిను కోరడంతో ఆమె జీవీఎంసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి నిధులు మంజూరుకు కృషి చేశారు. దీంతో కల్వర్టు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇకపై వర్షాల సమయంలో తమకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మహిళలకు నగదు అందజేస్తున్న సింహాచలం

రైతులకు రుణ సహకారం

పెందుర్తి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు వెన్నెముకగా పీఏసీఎస్‌ను తీర్చిదిద్దుతానని చైర్మన్ అయితి సింహాచలం అన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో సభ్యత్వం ఉన్న రైతులకు సోమవారం రుణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేఎల్‌జీ గ్రూపులకు రూ.19.5 లక్షలు, వ్యవసాయ రుణాలు రూ.12 లక్షలు, బంగారు రుణాలు రూ.23 లక్షలు వ్యక్తిగత రుణాలు రూ.11 లక్షలు మొత్తంగా రూ.65.5 లక్షల రుణాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన రుణ సదుపాయం, సాంకేతిక సహకారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు అవతారం, అచ్చిబాబు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 13 వినతులు

గాజువాక, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి సోమవారం 13 వినతులు వచ్చాయి. జోన్ పరిధిలో రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, వీధిలైట్లు వేయాలని, కుక్కల బెడదను నివారించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలంటూ పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులు వినతిపత్రాలను జెడ్సీ శేషాద్రికి అందజేశారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జడ్సీ సూచించారు.

వేపగుంట జోనల్ కార్యాలయంలో 17..

వేపగుంట: స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 17 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా జీవీఎంసీ 91, 98 వార్డుల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని, 93వ వార్డు గౌతమ్‌నగర్‌లో కుక్కల బెడద అధికంగా ఉందని, గొల్ల నారాయణపురంలో అక్రమ నిర్మాణాలు తొలగించాలని, 94వ వార్డు సేనాతివానిపాలెంలో యుజీడీ పైపులైన్ సమస్యను పరిష్కరించాలని, 97వ వార్డు బృందావన్ కాలనీలో ఎన్‌టీఆర్ కాలనీ స్థల సమస్య పరిష్కరించాలని, తదితర ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత శాఖలకు పంపిస్తామని జోనల్ కమిషనర్ కె.హైమావతి తెలిపారు.

పెందుర్తిలో కార్డెన్ సెర్చ్

పెందుర్తి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నేరాలు నియంత్రించేందుకు పెందుర్తి పరిసర ప్రాంతాల్లో సీఐ కేవీ సతీశ్‌కుమార్ సోమవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పెందుర్తి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పోలీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఓ దుకాణంలో నాలుగు బీరు సీసాలు, 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ప్రాంతంలో నివాసముంటున్న ఆరుగురు రౌడీషీటర్ల ఇళ్లను పోలీసులు తనిఖీలు చేశారు. మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టామని సీఐ తెలిపారు.

సినిమా గైడ్

● **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

● **కింగ్డమ్** : జగదాంబ

● **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి

● **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

● **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి), మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలు పు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 32, బీరకాయలు 48, ఆనపకాయ 20,కాలీఫ్లవర్ 34, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 40, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 74, బరబాటి 44, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50,బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 102, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, క్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190



రహదారిపై వృథాగా పారుతూ మురుగు కాలువలో కలుస్తున్న తాగునీరు

వృథాగా పోతున్న తాగునీరు

అధికారులు పట్టించుకోవడం లేదని మాతృశ్రీ నగర్ వాసుల ఆవేదన

కూర్మన్నపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు మాతృశ్రీ నగర్‌లో పలుచోట్ల పైపు లైన్లు లీక్ అవుతుండడంతో తాగునీరు వృథాగా రహదారులపై పారుతూ మురుగు కాలువల్లో కలిసిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపు లైన్లకు లేకేజీ వల్ల సరిపడినంత నీరు కొళాయిల నుంచి లభ్యం కాకపోవడంతో ప్రైవేటు వాటర్ ప్లాంట్ల నుంచి నీటిని కొనుగోలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. పైపు లైన్ల లీకేజీల కారణంగా నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని జీవీఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపు లైన్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ముఠా కార్మికుల ఆందోళన



వీడీఆర్ గొడౌన్స్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

మల్కాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత వాటి ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయడం సరికాదని వీడీఆర్ గొడౌన్స్ కార్మిక సంఘం అధ్యక్షుడు పి.పైడిరాజు అన్నారు. డాక్‌యార్డు సమీపంలో వీడీఆర్ గోడౌన్స్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో గోడౌన్స్ గేటు వద్ద సోమవారం ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ స్మార్ట్ మీటరు ఖరీదు రూ.9వేల నుంచి రూ.13వేల వరకు ఉంటుందని, దాని భారమంతా వినియోగదారులమీదే పడుతుందని అన్నారు. కార్మికులు ఎవరూ కూడా స్మార్ట్ మీటర్లను బిగించుకోవద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

గాజువాక: స్మార్ట్ విద్యుత్ మీటర్లను బిగించరాదని డిమాండ్ చేస్తూ పాత గాజువాకలో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.రాంబాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల విద్యుత్ వినియోగదారులకు పెను భారం పడుతుందన్నారు. సమయం బట్టి, వాడకం బట్టి విద్యుత్ టారిఫ్ ఉంటుందని, దన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లోకేశ్, అప్పారావు, యశోధ, అవతారం, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో మరో వ్యక్తి అరెస్టు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ లారీ స్టాండ్‌లో గత నెల 26న జరిగిన హత్యాయత్నం కేసులో మరో వ్యక్తిని స్టీల్ ప్లాంట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఆ రోజున దేశపాత్రునిపాలెం ప్రాంతానికి చెందిన మొల్లి సంతోశ్‌కుమార్‌పై దాడి చేసిన వారిలో ఇప్పటికే పదిమందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇప్పుడు ఏ14 ముద్దాయిగా ఉన్న నెలిముక్కుకు చెందిన వడ్డి శ్రీరామ్ (21)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎంపీపీ పాఠశాలను సందర్శించిన డీడీఈవో

అగనంపూడి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి బీసీ కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం డిప్యూటీ డీఈవో సునీత సందర్శించారు. పాఠశాలలో ఆవరణలో గల భవనం శిథిలావస్థకు చేరినందున తగిన చర్యలు చేపట్టాలని ఇటీవల పలువురు తల్లిదండ్రులు, స్థానిక నాయకులు డిప్యూటీ డీఈవోను కోరారు. ఈ నేపథ్యంలో ఆమె శిథిలైన భవనాన్ని పరిశీలించి, తక్షణమే దీనిని తొలిగించేందుకు చర్యలు చేపట్టేందుకు అనుమతులు మంజూరు చేశారు. అనంతరం సునీత విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. ప్రభుత్వం అనేక వసతులను కల్పిస్తున్నందున అందరూ బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దుంగల ఇందిర, స్థానిక నాయకులు కొర్రాయి జగదీశ్, జి.సత్యవతి, బి.సత్యనారాయణ, కె.రాంబాబు, సంతోషి, శ్యామ్‌లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ భెల్ హెచ్‌పీవీపీ నాయకులు

పెదగంట్యాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయానికి విశ్రాంత ఆచార్యులు డాక్టర్ జంధ్యాల రవీంద్రనాథ్, డాక్టర్ కె.విశ్వేశ్వరరావు 50 పుస్తకాలను విరాళంగా అందజేశారు. రచయిత కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి జయంతిని పురస్కరించుకుని సాహిత్యం, సాంకేతిక విజ్ఞానం, గణితం, వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను సోమవారం గ్రంథాలయాధికారి పీవీ రమణకు అందజేశారు. ఈ పుస్తకాలు పాఠకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని వారు పేర్కొన్నారు.

సీఐటీయూ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే యాజమాన్యం విధులోకి తీసుకోవాలని సీఐటీయూ భెల్ హెచ్‌పీవీపీ ప్రధాన కార్యదర్శి జీటీపీ ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఉక్కు కార్మికులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా సీఐటీయూ రూపొందించిన వాల్ పోస్టరును సోమవారం భెల్ కార్యాలయంలో ప్రకాశ్, తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించి వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సనపల జగన్నాథరావు, కె.నారపరెడ్డి, సి.కనకారావు, ఆర్.జనార్ధనరావు, పి.శివరాం, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శివలింగం

అగనంపూడి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకుని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజాది కార్యక్రమంల్లో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన, భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మట్టి గణపతికే జై!



- పారిశ్రామిక ప్రాంతంలో సిద్ధమవుతున్న విగ్రహాలు
- కోల్‌కత్తా, పెందుర్తి ఎర్రమట్టితో తయారీ
- వివిధ ఆకృతుల్లో రూపుదిద్దుతున్న కళాకారులు

మల్కాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొన్నేళ్లుగా మట్టి విగ్రహాలతో ఉత్సవాలు జరిపేందుకు నిర్వాహకులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే తాము అనుకున్న ఎత్తులో మట్టి ప్రతిమలు లభ్యం కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్లాస్టర్‌ఆఫ్ ప్యారిస్ విగ్రహాలనే మండపాల్లో కొలువుదీరుస్తున్నారు. ఈ ఏడాది ఆ సమస్యకు పరిష్కారం లభించినట్టే. మల్కాపురం ఎస్సీ కాలనీలో కోల్‌కత్తాకు చెందిన కళాకారులు పూర్తిస్థాయిలో నిర్వాహకుల ఆసక్తి తగ్గట్టుగా వివిధ రూపాల్లో మట్టి వినాయక విగ్రహాలను రూపొందిస్తున్నారు.

పారిశ్రామిక ప్రాంతం మట్టి వినాయక విగ్రహాలకు కేంద్రంగా మారుతోంది. ఇక్కడ మూడునెలలుగా విగ్రహాల తయారీ సాగుతోంది. కోల్‌కత్తాకు చెందిన కళాకారులు వీటిని మట్టితోనే రూపొందిస్తుండడం విశేషం. మల్కాపురం ఎస్సీ కాలనీకి కాలనీకి చెందిన కళాకారుడు అనపర్తి సైదులు విగ్రహాల తయారీలో కీలకపాత్ర పోషిస్తున్నారు. విగ్రహాల తయారీకి వీలుగా కోల్‌కత్తా నుంచి ప్రత్యేకమైన మట్టిని లారీల్లో తీసుకువచ్చారు. దీనికి పెందుర్తి ప్రాంతంలో లభ్యమయ్యే ఎర్రమట్టిని జోడించి అందమైన విగ్రహాలను రూపొందిస్తున్నారు. ముందుగా గడ్డి, ఊక, గోగు నార కర్రలతో విగ్రహాల నమూనాను సిద్ధం చేస్తున్నారు. అనంతరం ఆ విగ్రహానికి మట్టిని అద్ది, తుదిరూపును తీసుకువస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక్కో విగ్రహం సిద్ధం చేసేందుకు సుమారు 20 రోజుల సమయం పడుతోందని చెబుతున్నారు. మట్టి విగ్రహాల తయారీలో నిపుణులైన కళాకారులను కోల్‌కత్తా నుంచి రప్పించి, రేయింబవళ్లు విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు. నగరంలో వీలైనన్ని మండపాల్లో మట్టి వినాయక ప్రతిమలే ప్రతిష్ఠించేందుకు వీలుగా ఈ ఏడాది గణపతి నవరాత్రి నిర్వాహకులకు అందుబాటులో ఉంచాలనే ధ్యేయంతోనే ముందుగానే సిద్ధం చేస్తున్నామని కళాకారుడు సైదులు తెలిపారు.



ఛత్రపతి శివాజీ రూపంలో..



సిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలు



విగ్రహాన్ని తీర్చిదిద్దుతున్న కళాకారుడు

అప్పన్న ఆలయ శానిటరీ సూపర్‌వైజర్ సస్పెన్షన్

సింహాచలం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పారిశుధ్య ఉద్యోగి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇక్కడ పారిశుధ్య విభాగంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న జి.కొండలరావు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నట్టు ఈవో వేండ్ర త్రినాథరావు స్వయంగా గుర్తించి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సింహగిరిపై గాయిత్రీ పీఠం ఎదురు నుంచి పీఆర్‌ఓ కార్యాలయం వరకు ఉన్న డ్రైనేజీలో పేరుకుపోయినపూడిక తొలగించాలని ఈఓ హెచ్చరించినప్పటికీ ఫలితం లేకపోవడంతో సస్పెండ్ చేస్తూ ఆదివారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్య విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి పంతం శ్రీనివాస్, పర్యవేక్షణాధికారిణి రాజ్యలక్ష్మి స్వ యంగా పర్యవేక్షిస్తూ పూడిక తొలగింపు ప్రక్రియను రెండురోజుల్లో పూర్తిచేసిన తరువాత క్రమశిక్షణ చర్యలు తీసుకోవటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.50 వేల విలువైన పది కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన ప్రదీప్ దులిబస్క విశాఖ మీదుగా గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడని, అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

సమస్య మూలాలు తెలుసుకోండి

- అధికారులకు కలెక్టర్ నిర్దేశం
- పీజీఆర్ఎస్‌లో 304 వినతుల స్వీకరణ

మహారాణిపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుం చి వచ్చే అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర అధికారులతో కలిసి అర్జీ దారుల నుంచి 304 వినతులు స్వీకరించారు.ఇందులో రెవెన్యూ 80, జీవీఎంసీ 66, పోలీసు 22, ఇతర విభాగాల నుంచి 136 వినతులున్నాయి. అనంతరం అధికారులతో సమీక్షించిన కలెక్టర్ పలు మార్గదర్శకాలు జారీ చేశారు. సమస్యల పూర్వాపరాలు తెలుసుకొని పదేపదే వచ్చే వినతులను లోతుగా పరిశీలించి పరిష్కారమార్గాలు ఆలోచించాలన్నారు. ఉదాసీనంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్ని ఫిర్యాదులు వచ్చాయో క్రమం తప్పకుండా ఆడిట్ చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీ శంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు కృషి చేయాలి

స్వర్ణాంధ్ర ప్రణాళికకు అనుగుణంగా నిర్దేశిత లక్ష్యాలు సాధించేందుకు ఆయా శాఖల అధికారులంతా కృషి చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఫలితాలు సాధించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. పి-4 మార్గదర్శుల ఎంపిక ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని, ఎవరిపైనా ఒత్తిడి లేదన్నారు. బంగారు కుటుంబాలకు మార్గదర్శులకు తోడ్పాటునివ్వాలన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో వంద ఫిర్యాదులు

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్‌కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికకు వంద ఫిర్యాదులు అందాయి. సీపీ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఏసీపీ, సీఐలతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుటుంబకలహాలు, సివిల్ వివాదాలు, మోసం, ఆస్తివివాదాలకు సంబంధించిన ఫిర్యాదులున్నాయి.

జీవీఎంసీలో 99 వినతులు

వెంకోజీపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 99 వినతులు వచ్చాయని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తితో కలిసి మేయర్ పీజీఆర్ఎస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జీవీఎంసీ అధికారులను, జోనల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్, జేసీ, తదితరులు

అదనపులోడు క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అదనపులోడు క్రమబద్ధీకరణ గడువును డిసెంబరు 31వరకు పొడిగించినట్టు ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడువులోగా క్రమబద్ధీకరించుకునే వినియోగదారులకు ఫీజులో 50శాతం రాయితీ ఇస్తున్నట్టు వెల్లడించారు. ఈ ఏడాది మార్చి నుంచి జూన్ 30వరకు తొలుత అవకాశం కల్పించామని, వినియోగదారుల విజ్ఞప్తి మేరకు ఈఏడాది చివరవరకు పొడిగించామన్నారు. అదనపులోడును స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకుని రాయితీని పొందాలన్నారు. దీనివల్ల ఉపయోగాలు, రాయితీల ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, ఏఎస్ఆర్ పాడేరు, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు సర్కిళ్లలో విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు.

క్రైం... crime news

ఊబిలో చిక్కుకుని యువకుడి మృతి



లక్ష్మణరెడ్డి (ఫైల్ ఫొటో)

విజయనగరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా జామి మండలం జాగరం వాటర్‌ఫాల్స్‌లోని ఊబిలో చిక్కుకుని ఒక యువకుడు మృతిచెందాడు. జామి ఎస్ఐ వీరజనార్దన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం బొడ్డుపాలెం గ్రామానికి చెందిన సాడి లక్ష్మణరెడ్డి (32) సోమవారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా మిత్రులతో కలిసి జాగరం వాటర్‌ఫాల్స్‌కు వచ్చాడు. సాయంత్రం ఆరుగంటల సమయంలో బహిర్భూమికి వెళ్లి, పక్కన ఉన్న నీటితో శుభ్రం చేసుకునే సమయంలో కాలుజారి పడిపోయాడు. స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదు. మంగళవారం మృతదేహం కనిపించింది. భర్త చనిపోవడంతో అరుణ రోదన చూపరులను కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. రామాటాకీస్ ఏరియాలో ఉన్న ఎక్సెల్‌వరల్డ్‌లో సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడని స్నేహితులు తెలిపారు.

ఆత్మహత్యా యత్నాన్ని అడ్డుకున్న పోలీసులు

పెందుర్తి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన వివాహితను సకాలంలో స్పందించిన పోలీసులు కాపాడారు. ఈ ఘటన పెందుర్తి సూర్యానగర్‌లో సోమవారం జరిగింది. ఇక్కడి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిస్తోందని ఉదయం 10 గంటలకు డయల్ 112కు ఫోన్ వచ్చింది. సీఐ కేవీ సతీశ్‌కుమార్ బ్లూకోట్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, హెచ్‌సీ అప్పారావులను అప్రమత్తం చేశారు. వారు ఘటనా స్థలికి చేరుకుని, తలుపులకు తాళం వేసి ఉండడంతో పగలుగొట్టి లోపలికి ప్రవేశించారు. అప్పటికే ఫ్యానుకు చీర బిగించి ఆత్మహత్యకు యత్నిస్తున్న వివాహితను కాపాడారు. అనంతరం బాధిత మహిళకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆత్మహత్యకు కారణాలను సేకరించగా తన భర్త ఆటో డ్రైవర్ అని, ఒక పాప, బాబు ఉన్నారని, కుటుంబ కలహాలతో ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపింది. దీంతో రాతపూర్వక ఫిర్యాదు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఆత్మహత్యకు పాల్పడడం సరికాదని ఆమెకు హితవు పలికారు. పోలీసుల స్పందనపై స్థానికులు ప్రశంసలు కురిపించారు.

స్పా సెంటర్‌పై పోలీసుల దాడి

- నిర్వాహకులతో పాటు పది మంది అరెస్టు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ ఐదో సక్టార్ గిరిజన్ భవన్ సమీపంలోని యాక్షన్ బ్యూటీ జోన్ యూనీసెక్స్ సెలూన్‌లో టాస్క్‌ఫోర్స్, ఎంవీపీ పోలీసులు దాడి చేశారు. స్పా పేరిట హైటెక్ వ్యభిచారం జరుగుతుందన్న సమాచారంతో చేపట్టిన దాడుల్లో ఆరుగురు యువతులు, ఇద్దరు విటులు, ఇద్దరు నిర్వాహకులు పట్టుబడ్డారు. యువతులను ప్రభుత్వ మహిళా సంరక్షణ కేంద్రానికి తరలిస్తామని సీఐ మురళి తెలిపారు.

మహిళలకు ఒకేచోట రక్షణ సేవలు: పీడీ

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు సేవలన్నీ ఒకేచోట అందిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ కేవీ రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గృహ హింస నుంచి మహిళల రక్షణ చట్టం-2005 ప్రకారం మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిని రక్షణ అధికారిగా నియమించామన్నారు. లీగల్ కౌన్సిలర్, సోషల్ కౌన్సిలర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హోంగార్డులను నియమించామన్నారు. డీవీ సెల్‌ను మహిళా శిశు సాధికారిత అధికారిణి ఆధ్వర్యంలో కేజీహెచ్‌లోని వన్‌స్టాప్ సఖి సెంటర్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డొమెస్టిక్ వయలెన్స్ చట్టానికి సంబంధించిన సేవలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మాత్రమే అమలవుతున్నాయన్నారు. మిషన్ శక్తి పథకంలో భాగంగా జిల్లాలో మరే ప్రైవేటు సంస్థలు, ఎన్‌జీవోల ప్రమేయం లేదన్నారు. మహిళలు గృహ హింసకు సంబంధించి డీవీ సెల్ సేవలను వినియోగించుకోవాలని ఆమె కోరారు.

సీఎస్ఆర్ఎంవో జాబ్ చార్ట్ అమలుచేయాలి

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో సీఎస్ఆర్ఎంవో విధులకు సంబంధించిన జాబ్ చార్ట్‌ను అమలు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సీఎస్ఆర్ఎంవో డాక్టర్ యు.శ్రీహరి సూపరింటెండెంట్ డాక్టర్ వాణిని కోరారు. ఈ మేరకు సోమవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇందులో అనేక అంశాలను ప్రస్తావించారు. జాబ్ చార్ట్ అమలు చేయకపోవడం వల్ల అనేక పనులు చేయలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. జాబ్‌చార్ట్‌లోని విధులను కొన్నింటిని అడ్మినిస్ట్రేటర్‌గా వ్యవహరిస్తున్న అధికారికి అప్పగిస్తున్నారని, దీనివల్ల సిబ్బందిలో అయోమయం నెలకొంటోందన్నారు. ఆస్పత్రిలో రోజువారీ కార్యకలాపాలు సాఫీగా సాగేందుకు తన జాబ్ చార్ట్‌ను పక్కాగా అమలు చేయాల ని, విధులకు ఆటంకం లేకుండా చూడాలన్నారు.


పిల్లల దత్తతకు నూతన మార్గదర్శకాలు: కలెక్టర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, జేసీ మయూర్ అశోక్ తదితరులు

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం పిల్లల దత్తత ప్రక్రియను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పాన్‌కార్డు, ఆదాయ, వయసు, నివాస, వివాహ, ఆరోగ్య ధృవీకరణ పత్రాలను దత్తత తీసుకునే వ్యక్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం నూతన మార్గదర్శకాలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ పీజీఆర్ఎస్‌లో ఆవిష్కరించారు. పలు అంశాలపై ఆయన సూచనలు చేశారు. దత్తత తీసుకోవాలనుకునే వారు అదనపు సమాచారం కోసం దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఐసీడీఎస్ పీడీ, ఇతర అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీ శంకర్, ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మి పాల్గొన్నారు.

ఆక్వాటిక్ టోర్నీలో గణేష్‌కు పతకం



గణేష్ చక్రధర్

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ టోర్నీలో విశాఖ స్విమ్మర్ జక్కా గణేష్ చక్రధర్ పతకం సాధించాడు. అహ్మదాబాద్‌లో జరుగుతున్న 51వ జాతీయ జూనియర్ స్విమ్మింగ్ టోర్నీలో సోమవారం గ్రూప్-1 బాలుర 50 మీ. బ్రెస్ట్ స్ట్రోక్ ఈవెంట్‌లో 0.31.19 టైమింగ్‌తో కాంస్య పతకం సాధించాడు. సంఘం ప్రతినిధులు ఎ.మోహన వెంకటరామ్, సంతోష్ శెట్టి, విజయ్‌కుమార్, కోచ్‌లు, సీనియర్ స్విమ్మర్లు గణేష్ చక్రధర్‌కు అభినందనలు తెలిపారు.

అత్యుత్తమ ప్రగతితోనే విజేతగా నిలిచే అవకాశం

- ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్



జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా అన్నిరంగాల్లో పోటీతత్వం పెరిగిందని, ఈ పోటీలో విజేతగా నిలవాలంటే విద్యా సంబంధిత అంశాల్లో ప్రగతిని చూపించాల్సిన అవసరం ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యార్థులను భవిష్యత్తులో పరిశోధనా రంగంలో రాణించే దిశగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా యూజీ రీసెర్చ్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించుకుని, చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. నాలుగేళ్ల జీవితం భవిష్యత్తును నిర్దేశిస్తుందని గుర్తించుకోవాలన్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా కరికులం అమలు చేస్తున్నామన్నారు. వర్సిటీలో అత్యుత్తమ క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఇతరుల ప్రభావానికి లోనుకాకుండా, విద్యపై దృష్టి సారించాలన్నారు. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ టెక్ సొసైటీల్లో భాగస్వాములు కావడం ద్వారా నిరంతరం నైపుణ్యం పెంపొందించుకోవచ్చన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు మాట్లాడుతూ ఎనిమిది వేల మంది విద్యార్థులతో కాలేజీ దేశంలోనే అత్యుత్తమ కళాశాలల్లో ఒకటిగా నిలుస్తోందన్నారు. 14 బీటెక్ కోర్సులు, 27 ఎంటెక్ కోర్సులు, 17 విభాగాలను నిర్వహిస్తున్నామన్నారు. ర్యాగింగ్ రహితంగా కళాశాలను తీర్చిదిద్దుతామన్నారు. మెరుగైన ఉపాధి అవకాశాలతోపాటు స్టార్టప్, విదేశాల్లో ఉన్నతవిద్యకు విద్యార్థులు వెళ్లడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, హాస్టల్ వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా డ్వాక్రా దుకాణాల లాటరీ

- ఆరు స్క్రీన్లపై దరఖాస్తుదారుల జాబితా
- ప్రక్రియ మొత్తం వీడియో రికార్డింగ్



లాటరీకి హాజరైన సభ్యులు, మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైతుబజార్లలో డ్వాక్రా దుకాణాల కేటాయింపు అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం కలెక్టరేట్‌లో దరఖాస్తుదారులతోనే లాటరీ తీయించారు. నగరంలోని 13 రైతుబజార్లలో 71 డ్వాక్రా దుకాణాలు, మరో 29 దివ్యాంగుల దుకాణాలకు గత నెలలో నోటిఫికేషన్ ఇచ్చారు. వీటిని దక్కించుకోవడానికి పాత డ్వాక్రా గ్రూపులు తీవ్ర ప్రయత్నాలు చేశాయి. ఎమ్మెల్యేలతో సిఫారసు చేయించాయి. మరికొందరు డబ్బులు ఎరగా పెట్టారు. వీటన్నింటిని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించడంతో జాయింట్ కలెక్టర్ అప్రమత్తమయ్యారు. ఆయనే దగ్గరుండి లాటరీ నిర్వహించారు. దరఖాస్తుదారుల పేర్లను సమావేశ మందిరంలోని ఆరు టీవీ స్క్రీన్లపై ప్రదర్శించారు. అందరి పేర్లు ఉన్నాయని నిర్ధారణ అయిన తరువాత అక్కడికి వచ్చిన డ్వాక్రా సభ్యులతోనే లాటరీ తీయించి, అక్కడికక్కడే రికార్డులో ఎవరికి దుకాణం వచ్చిందో పేర్లు నమోదు చేయించారు. దివ్యాంగుల దుకాణాలు కూడా కేటాయించారు. వంద శాతం పారదర్శకంగా నిర్వహించడంతో దుకాణాలు రానివారు సైతం సంతోషం వ్యక్తంచేశారు.